https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్ధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 274 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం, జూలై,30, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

### తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు

## సుప్రీంకోర్టులో భారీ ఊరట



హైదరాబాద్, జులై 29: తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం(రావీ)ను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

## సాగు విధానాన్ని మార్చుకోండి

### ఎల్‌నినో ప్రభావంపై రైతులకు మంత్రి పొంగులేటి సూచన



వరంగల్,జూలై 29:వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సాగు విధానాన్ని మార్చుకోవాలని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలు, పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తిరుమలాయపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌తో కలిసి మంత్రి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాపాయిగూడెంలో రూ. 2.40 కోట్ల అంచనా వ్యయంతో ఖమ్మం-- వరంగల్ ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి తెట్టెలపాడు మీదుగా నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. జూపెడ గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం మేడిదపల్లిలో ఆర్టీసీ బస్ షెల్టర్, పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి భరోసా కల్పించే దిశగా పనిచేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని పేర్కొంటూ, తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేశామని వెల్లడించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా పక్కా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా పథకం కింద తొలి విడతగా రైతుల ఖాతాల్లో రూ. 6 వేల చొప్పున జమ చేశామని చెప్పారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసిందని, సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాకు రూ. 500 ప్రోత్సాహకం అందిస్తున్నామని వెల్లడించారు.

## 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం..



న్యూఢిల్లీ, జులై 29: జాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. బుధవారం సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది. ఇకపై వందేమాతరాన్ని అవమానించినా, లేదా ఎవరైనా ఆలపిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకం గా ఆటంకం కలిగించినా దాన్ని చట్టప్రకారం తీవ్ర నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా చరిత్రాత్మక 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్ - 1971' (జాతీయ గౌరవానికి భంగం కలిగించే నిరోధక చట్టం)లో కీలక సవరణలు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు చట్టపరమైన రక్షణలు అమల్లో ఉన్నాయో.. అవే అత్యున్నత రక్షణలను జాతీయ గేయమైన వందేమాతరా నికి కూడా వర్తింపజేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

## విద్యార్థుల భవిష్యత్తుకు రక్షణ..

### లోక్‌సభ ఆమోదంతో పేపర్ లీక్‌లకు చెక్

### కేంద్ర మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ,జూలై, 29:** దేశంలోని లక్షలాది మంది పరీక్షార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం ద్వారా పోటీ పరీక్షల్లో పారదర్శకత పెరుగుతుందని, పేపర్ లీకేజీలు, నకిలీ పరీక్షలు, ఇతర అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఆయన పేర్కొన్నారు. నిజాయతీగా శ్రమించే విద్యార్థుల భవిష్యత్తును రక్షించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. 'పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవు. పేపర్ లీక్‌లు, మోసపూరిత కార్యకలాపాలు, పరీక్షల గోప్యతను భంగం చేసే వారిపై కఠిన శిక్షలు అమలు చేస్తాం. ఈ చట్టం అమల్లోకి రావడంతో పోటీ పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసం మరింత పెరుగుతుంది. ప్రతిభ ఆధారంగా అవకాశాలు లభించే వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది' అని అన్నారు.

## మధ్యప్రదేశ్‌లో రైతుల మహాపాదయాత్ర



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో రైతాంగ అసంతృప్తి భగ్గుమంది. మూంగ్ పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందనీ, ఎరువుల సమస్యలను పరిష్కరించలేదని ఆరోపిస్తూ వేలాది మంది రైతులు రాష్ట్ర రాజధాని భోపాల్ వైపు కదిలారు. వారిని అడ్డుకునేందుకు బీజేపీ ప్రభుత్వం భారీగా పోలీసులను మోహరించింది. బారికేడ్లు ఏర్పాటు చేసింది. అయినప్పటికీ.. రైతులు వాటిని దాటి రాజధాని శివార్లకు చేరుకుంది. ప్రస్తుతం ఈ పరిణామం రాష్ట్రంలో తీవ్ర రాజకీయ చర్చకు దారితీసింది. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో 19 రైతు సంఘాలకు చెందిన సుమారు రెండు వేల మంది రైతులు నర్మదాపురం నుంచి భోపాల్ వరకు పాదయాత్ర చేపట్టారు. వారం పాటు రాజధానిలోనే ఉండేందుకు పరుపులు, ధాన్యపు సంచులు, వంటసామగ్రి, ఆహార పదార్థాలతో బయలుదేరిన రైతులు తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి వెళ్లబోమని ప్రకటించారు. ?మూంగ్ పంటను 100 శాతం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో ప్రభుత్వం కొనుగోలు చేయాలనేదే రైతుల ప్రధాన డిమాండ్. కేంద్రం తూర్, ఉరద్, మసూర్ పంటలను పూర్తి స్థాయిలో ఎంఎస్‌పీతో కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయినప్పటికీ.. మూంగ్ పంటను మాత్రం ప్రైస్ సపోర్ట్ స్కీమ్ కింద ఉంచి రాష్ట్ర ఉత్పత్తిలో 25 శాతం వరకు మాత్రమే కొనుగోలు చేయడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. ఫలితంగా మిగిలిన పంటను మార్కెట్‌లో ఎంఎస్‌పీ కంటే తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. రైతు నాయకుడు సంతోశ్ పట్వారీ మాట్లాడుతూ.. గత 20 రోజులుగా ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదన్నారు. దీంతో ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ నివాసానికి వెళ్లి తమ గోడు వినిపించడమే మార్గమని నిర్ణయించుకున్నట్టు చెప్పారు.

### బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే

## హైడ్రాను ముంచుతామంటారా?'..

### కేటీఆర్‌పై తుమ్మల సెటైర్



హైదరాబాద్, జులై 29: హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు.రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## సీతమ్మసాగర్' ప్రాజెక్టుకు బిగ్ రిలీఫ్

### సుప్రీంకోర్టు తీర్పుపై మంత్రి తుమ్మల హర్షం



సత్తుపల్లి :తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక తీర్పుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మైలురాయి లాంటి 'సీతమ్మ సాగర్' బహుళార్ధసాధక ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 36.37 టీఎంసీల నీటిని నిల్వ చేసి, దాదాపు 6.74 లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించవచ్చని స్పష్టం చేశారు. నీటిపారుదలతో పాటు 282.80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడే పర్యావరణ అనుమతుల సాధన కోసం నిరంతరం కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, అధికారులకు మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు.


### రష్యా-ఇరాన్ చమురు

## కొనుగోలుదారులపై అమెరికా ఆంక్షలు -



వాషింగ్టన్ : రష్యా, ఇరాన్ దేశాల నుంచి చమురును అధిక పరిమాణంలో కొనుగోలు చేసే దేశాలపై ఆంక్షలు విధించేందుకు దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అధికారాలు కట్టబెట్టే ద్వైపాక్షిక బిల్లును వేగంగా ముందుకు తీసుకుపోవడానికి అమెరికా సెనెట్ అంగీకారం తెలిపింది. దీనికి అనుకూలంగా 86 ఓట్లు పడగా కేవలం 12 మంది మాత్రమే వ్యతిరేకించారు. సెనెట్ నిర్ణయం భారత్, చైనా వంటి ప్రధాన చమురు కొనుగోలుదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వంద మంది సభ్యులున్న సెనెట్‌లో ఈ బిల్లు తేలికగానే ఆమోదం పొందుతుందని భావిస్తున్నారు. ఈ నెల 11న మరణించిన దక్షిణ కరోలినా సెనెటర్ లిండ్సే గ్రహమ్‌కు తుది వీడ్కోలు పలికేందుకు సెనెటర్లు సమావేశమయ్యారు. ఆ తర్వాత వారు అమెరికా పర్యటనలో ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీని కలుసుకున్నారు.

## కర్ణాటకలో 7 వేల మంది విద్యార్థులకు హెచ్ఐవీ





బెంగళూరు: కర్ణాటకలో యువతలో హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్ పెరుగుదలపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల్లో హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్ శిబిరాలను తప్పనిసరి చేసింది. అయితే ఎవరి అనుమతి లేకుండా ఎలాంటి పరీక్షలు లేదా స్క్రీనింగ్ నిర్వహించబోమని అధికారులు స్పష్టం చేశారు. దేశంలో అత్యధిక హెచ్ఐవీ బాధితులున్న రాష్ట్రాల్లో కర్ణాటక మూడో స్థానంలో ఉంది. తాజా నివేదికల ప్రకారం రాష్ట్రంలో 18 నుంచి 25 ఏండ్ల మధ్య వయసు కలిగిన ఏడు వేలకు పైగా విద్యార్థులు హెచ్ఐవీ బారిన పడ్డారు.

# స్ఫూర్తిదాయకం..రవికుమార్ గౌడ్ ఔన్నత్యం..!

## హనుమాన్ మందిర్ పునర్నిర్మాణానికి రూ.రెండు లక్షలు అందజేత

-సేవా కార్యక్రమాల్లో మరోసారి ఆదర్శంగా నిలిచిన లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట అధ్యక్షులు రవికుమార్ గౌడ్... -మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్ గా ఓటమి చెందిన... -ఆ సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నరవికుమార్ గౌడ్... -కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం... -లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రాబోయే ఏడాది కాలం పాటు పేదలు,నిరాశ్రయులకు ప్రతి నిత్యం మధ్యాహ్న భోజనం...




నారాయణపేట,(డీకే చాటింపు): గత మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కౌన్సిలర్ గా పోటీ చేసిన సమయంలో బూరుడు వాడి హనుమాన్ మందిర్ పునర్నిర్మాణానికి తమ వంతు సహకారాన్ని అందిస్తానని వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు.ఆ ఎన్నికల్లో ఆయన ఓటమి చెందిన వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా రెండు లక్షల విరాళాన్ని తమ తండ్రి తిమ్మయ్య గౌడ్ చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందజేసి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు కూరగాయల వ్యాపారి రవికుమార్ గౌడ్..!

ప్రజలకు సేవ చేసేందుకు...

ప్రజలకు సేవ చేయడమే పరమాత్మను ప్రసన్నం చేసుకునే మార్గమనే నమ్మకంతో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట అధ్యక్షులు రవికుమార్ గౌడ్ పేర్కొన్నారు.గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం నారాయణపేట పట్టణంలోని బూరుడు వాడి హనుమాన్ మందిర్ పునర్నిర్మాణానికి రూ.రెండు లక్షల విరాళాన్ని తమ తండ్రి తిమ్మయ్య గౌడ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ కోశాధికారి మార్తాండ్ రావు సాక్రెకు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆలయ కమిటీ సభ్యులు హనుమాన్ మందిర్ పునర్నిర్మాణానికి సహకరించాలని కోరారని, వారికి ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు రెండు లక్షల రూపాయల విరాళాన్ని అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేవుని ఆశీస్సులతో భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో భక్తులకు, స్థానిక ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రాబోయే ఏడాది కాలం పాటు ప్రతిరోజూ పేదలు, నిరాశ్రయులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, అలాగే నారాయణపేట వ్యవసాయ మార్కెట్లో ప్రతి బుధవారం రైతులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.చదువుల్లో,క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులతో పాటు అగ్నివీర్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్, అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తూ వారి ఉన్నత భవిష్యత్తుకు తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. సమాజ సేవే తమ ధ్యేయమని,భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని రవికుమార్ గౌడ్ పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి చెందిన...

గత మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా పోటీ చేసి ఓటమి చెందిన తర్వాత కూడా తమ హామీని నిలబెట్టుకుని అందరికీ స్ఫూర్తిగా నిలిచారు రవికుమార్ గౌడ్..! ఓటమి చెందిన రవికుమార్ గౌడ్ తమ హామీని నిలబెట్టి ఆ వార్డులో తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ, అవార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేసి ఆయనను అభినందించారు.ఇతరులకు స్ఫూర్తిదాయకం రవికుమార్ గౌడ్ అని పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన సామాజిక సేవలే అందుకు నిదర్శనమని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావ్ నామాజీ,మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభాకర్ కమలాపూర్,రాఘవేంద్ర, లయన్స్ క్లబ్ కార్యదర్శి కోన మోహన్,కోశాధికారి పోలేపల్లి రాజేష్,స్థానిక పెద్దలు కాశ్మీన్ కాలప్ప,అనంతయ్య, సంతోష్,మధుసూదన్, శివకుమార్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వాడి వేడిగా మండల సర్వ సభ సమావేశం

## పలు సమస్యలపై ప్రస్తావించిన సర్పంచులు

-బోయిన్ పల్లి తాండ రోడ్డు దయనీయ స్థితిపై ఆ గ్రామ సర్పంచ్ ఆవేదన... -ఇందిరమ్మ ఇళ్ల పథకంపై పలు గ్రామాల సర్పంచుల నిరసన... -మండల సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించిన సర్పంచులు... -ఇకనుంచి ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాబోవని అధికారుల హామీ... -నారాయణపేట మండల సర్వసభ్య సమావేశం...




నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండల సర్వసభ సమావేశం బుధవారం ఎంపీడీవో విజయ కుమారి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి డిఆర్డిఏ పీడీ వెంకట రాములు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు వివిధ సమస్యలపై ప్రస్తావిం చారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం..అసంపూర్తి రోడ్లు.. ఆర్డ బ్ల్యూఎస్ పనితీరు.. ఉపాధ్యాయుల వ్యవహార శైలి..మండల సమావేశానికి రాని పలు శాఖల అధికారుల పనితీరు..తదితర అంశాలపై సర్పంచులు చర్చించారు. దాంతో ఈ సమావేశం వాడి వేడిగా కొనసాగింది.ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏకాదటిగా కొనసాగిన ఈ సమావేశంలో ముఖ్యంగా పలు గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, నిర్మాణాలు,బిల్లుల చెల్లింపు, లబ్ధిదారుల ఎంపికపై ఎటువంటి సమాచారం తమకు ఇవ్వడం లేదని పేర్కొంటూ మండల స్వర సభ సమావేశాన్ని బహిష్కరించాలని అభంపూర్ సర్పంచ్ రవి, ఊట కుంట సర్పంచ్ వెంకట నాయక్,సింగారం సర్పంచ్ కే. నాగిరెడ్డి,ఏక్లాస్ పూర్ సర్పంచ్ శేఖర్ గౌడ్ తదితర గ్రామాల సర్పంచులు నిర్ణయం తీసుకున్నారు. అందుకు ఎంపీడీవో విజయ కుమారి, ఎంపీఓ బాలాజీ మాట్లాడుతూ ఇకనుంచి ఈ సమస్య ఉత్పన్నం కాబోదని, ప్రతి విషయం సర్పంచ్లకు తెలియజేస్తామని హామీ ఇవ్వడంతో వారు సమావేశం బహిష్కరణ కార్యక్రమాన్ని విరమించుకున్నారు. నారాయణపేట మండలం బోయిన్ పల్లి గ్రామం నుంచి బోయిన్ పల్లి తాండ వరకు బీటీ రోడ్డును నిర్మించేందుకు 2017లో రూ.55 లక్షలు మంజూరైనట్లు బోయిన్ పల్లి తాండ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు.2018లో ఈ రోడ్డు పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ ఆ తర్వాత రోడ్డును పూర్తి చేయకపోవడంతో ప్రస్తుతం రోడ్డు అసంపూర్తిగా మారిందని తెలిపారు. బోయిన్ పల్లి తండాకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల రవాణా ఇబ్బందులను పరిష్కరించాలని సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ అధికారులకు కోరారు.తండా ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని,రోడ్డు అధ్వానంగా ఉండటంతో వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రమవుతోందని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టి,పనులను త్వరితగతిన ప్రారంభించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ లక్ష్మణ్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.వెంటనే రోడ్డును నిర్మించాలని కోరగా డీఆర్డీఏ పీడీ వెంకట రాములు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అభంగాపూర్,బోయిన్ పల్లి తాండ తదితర పాఠశాలలోఉపాధ్యాయుల కొరత ఉందని ఆయా గ్రామాల సర్పంచ్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.పేరపళ్ల పాఠశాలలో పూర్తిస్థాయిలో టీచర్లు లేరని,ఇదే విషయంపై పాఠశాలకు వెళ్లి హెడ్ మాస్టర్ తో ప్రస్తావిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు ఆ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు.సర్పంచుకే ఆ విధంగా సమాధానం ఇస్తే ఇక వారు ఏ విధంగా విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.ఈ సమస్యను పరిష్కరించాలని ఎంఈఓ బాలాజీకి అధికారులు తెలిపారు.అలాగే ఒక పాఠశాల విద్యార్థులు బాత్రూమ్,మధ్యాహ్నం భోజనం కోసం మరో పాఠశాలకు వెళ్ళవలసిస్తుందని దాంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.బోయిన్ పల్లి తాండ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో

ఎల్-3లో ఉన్న పేర్లను ఎల్-1 లోకి తీసుకురావాలని కోరారు.అలాగే ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బదిలీపై వెళ్లిన తర్వాత పలు పలు గ్రామాలకు సంబంధించిన పనుల రికార్డులను ఇంతవరకు పూర్తి చేయలేదని,ఈ విషయంపై ఫోన్లో సంప్రదించగా ఆయన

ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని


తెలిపారు.ఏఈ శశికిరణ్ పై చర్యలు తీసుకొని రికార్డులు అందించాలని కోరారు.

పలు శాఖల అధికారులు మండల సమావేశానికి రాకపోవడంతో వారికి నోటీసులు జారీ చేస్తామని ఎంపీడీవో వెల్లడించారు.

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సత్యం, ఎక్సైజ్ ఎస్సై గురవయ్య, ఎంఈఓ బాలాజీ,వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు క్లిష్టమైన శస్త్రచికిత్సలు

-ప్రభుత్వ వైద్య కళాశాల, నారాయణపేట ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంపత్ కుమార్ సింగ్ మార్గదర్శకత్వంలో... -వైద్యుల నైపుణ్యం,సమిష్టి కృషితో... -నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో మెరుగైన వైద్య సదుపాయాలు... -శస్త్రచికిత్సల్లో పాల్గొన్న వైద్యులు,నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బందిని అభినందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంపత్ కుమార్ సింగ్...

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మెడలో సిస్టిక్ హైగ్రోమాతో బాధపడుతున్న హనుమంతు(33 ),అలాగే లాలాజల గ్రంథి కణితితో బాధపడుతున్న పాపమ్మ (60)కు వైద్యులు బుధవారం విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించి అందరి చేత ప్రశంసలు పొందారు.ఎంతో క్లిష్టమైన ఈ రెండు శస్త్ర చికిత్సలను విజయవంతంగా వైద్య బృందం నిర్వహించింది.

ప్రభుత్వ వైద్య కళాశాల, నారాయ ణపేట ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంపత్ కుమార్ సింగ్ మార్గదర్శకత్వంలో హైదరాబాద్ నుంచి వచ్చిన హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ అచ్యుత్ సహకారంతో చెవి,ముక్కు, గొంతు విభాగ నిపుణులు డాక్టర్ వి.దీపిన్ కుమార్, డాక్టర్ సి.అమృత్,జనరల్ సర్జరీ విభాగానికి చెందిన డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైద్య బృందం ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించింది.వైద్యుల నైపుణ్యం,సమిష్టి కృషి నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సదుపాయాల సహకారంతో రెండు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయి.ప్రస్తుతం హనుమంతు,పాపమ్మల ఆరోగ్య పరిస్థితులు నిలకడగా ఉన్నాయని వైద్యులు తెలిపారు.

నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన,ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని,ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని వైద్య బృందం పేర్కొంది.ఈ విజయవంతమైన శస్త్రచికిత్సల్లో పాల్గొన్న వైద్యులు,నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బందిని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంపత్ కుమార్ సింగ్ అభినందించారు.

# కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు- ఎమ్మెల్యేసుధీర్ రెడ్డి

## -ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపిన .భాగ్యనగర్ కాలనీ అధ్యక్షులు రాము,జనరల్ సెక్రెటరీ మామిడి జగన్నాథరెడ్డి



ఎల్బీనగర్, జూలై 29 (డీకే చాటింపు) ఎల్బీనగర్ శాసనసభ్యులు .దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లింగోజిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద గత రెండు రోజులుగా వర్షపు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి రోడ్డు మీద నిలిచి ఉండడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కాలనీవాసుల సూచన మేరకు సుధీర్ రెడ్డి పర్యటించడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఇక్కడ ఉన్న వరదనీరు తొలగిస్తున్న మళ్ళీ వరదనీరు వచ్చి చేరుతుంది అని అన్నారు. వెంటనే సుధీర్ రెడ్డి స్థానిక వాటర్ వర్క్స్ అధికారులకు ఫోన్ చేసి వెంటనే ఇంద్ర నాగేంద్ర నుంచి ఎస్బిఐ బ్యాంక్ వరకు క్రింద వేసిన ట్రంక్ లైన్ నందు ఏమైనా చెత్తాచెదారం పేరుకుపోయిందో చూడాలని కోరడం జరిగింది.దానికి వెంటనే స్పందించిన అధికారులు ఒక్కొక్క డ్రైనేజ్ మ్యాన్ హోల్స్ వద్ద చూడగా కొన్నిచోట్ల చెత్తాచెదారంతో డ్రైన్స్ నిండిపోయి అ వరదనీరు ఇట్టి కాలనీ లోనికి రావడం జరిగిందని గుర్తించడం జరిగింది. వెంటనే అట్టి మ్యాన్ హోల్స్ నందు చెత్తాచెదారం శుభ్రం చేయగా భాగ్య నగర్ కాలనీ నందు ఉన్న వర్షపునీరు సాఫీగా వెళ్లడం జరిగింది.దానికి గాను కాలనీవాసులు సుధీర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.అలాగే ఎప్పటికప్పుడు మ్యాన్ హోల్స్ నందు పేరుకుపోయిన చెత్తాచెదారం క్లీన్ చేయాలని అధికారులను కోరడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో లింగోజిగూడా డివిజన్ సీనియర్ నాయకులు తిలక్ రావు,కాలనీ అధ్యక్షులు రాము,జనరల్ సెక్రెటరీ మామిడి జగన్నాథరెడ్డి,రాజు యాదవ్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# టీవీ టవర్ కాలనీలోని ఎస్సీ బాలుర జూనియర్ కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



కొప్పుల రాజేందర్ డీకే.చాటింపు హనుమకొండ హనుమకొండ 100 ఫీట్ల రోడ్డు సమీపంలోని టీవీ టవర్ కాలనీలో ఉన్న షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని బాలుర జూనియర్ కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ చహత్ బాజ్ పేయి ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్టల్ ప్రాంగణం, విద్యార్థులు నివసిస్తున్న గదులు, వంటగది, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజన పదార్థాల నాణ్యత, నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం హాస్టల్లోని మొదటి,రెండో అంతస్తుల్లో ఉన్న విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. వారు ఏ కళాశాలల్లో చదువుతున్నారో, కళాశాలకు ఎలా వెళ్తున్నారో, హాస్టల్లో భోజనం, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్ అందుబాటులో ఉంటున్నారా, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను ప్రశ్నించారు.ఆకస్మిక తనిఖీ సమయంలో హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీసి, విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్లోని గదులు, ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సురక్షితమైన వాతావరణం కల్పించడం అధికారులు, సిబ్బంది బాధ్యత అని అన్నారు. విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.ఈ తనిఖీలో హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## .. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




కొప్పుల రాజేందర్ డీకే.చాటింపు హనుమకొండ పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య పరిరక్షణ కోసం వన్యప్రాణులను కాపాడుకోవడం అత్యంత అవసరమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్కులో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పులుల దినోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పులి వన్యప్రాణుల్లో అత్యంత కీలకమైన జాతి అని, అడవుల పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పులుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఒకప్పుడు పులుల వేట విస్తృతంగా జరిగేదని, అటవీశాఖ చేపట్టిన కఠిన చర్యలతో అక్రమ వేట గణనీయంగా తగ్గి, దేశంలో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు.దేశంలో చిరుతల (చీతాలు) సంఖ్య తగ్గిపోవడంతో వాటిని ఇతర ఖండాల నుంచి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు.తెలంగాణ లోని కవ్వాల్ పులుల అభయారణ్యంలో ప్రస్తుతం ఒక్క పులి కూడా లేకపోవడం ఆందోళనకరమని,అదే సమయంలో సమీపంలోని మహారాష్ట్ర తడోబా అభయారణ్యంలో పులుల సంఖ్య గణనీయంగా ఉందని తెలిపారు.

అడవులు,వన్యప్రాణులు అంతరించిపోకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని, వాటి పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న పులులతో పాటు ఇతర వన్యప్రాణులను సంరక్షించడం సమాజం మొత్తం బాధ్యతన్నారు. వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోవడానికి అనేక కారణాలున్నాయని, వాటి నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమని తెలిపారు. భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలంటే విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు మయూరి, శిరీష, శ్రీనివాస్, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధి శ్యామ్ సుందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం, జూలై,30, 2026

## అమెరికా అసలు లక్ష్యం
# చమురు నిక్షేపాలు..!

లాటిన్ అమెరికాలోని వెనిజులా ప్రస్తుతం ఒక విచిత్ర పరిస్థితిలో ఉంది. కారకాస్‌పై దాడి చేసిన అమెరికా నిద్రలో ఉన్న అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణి సిసిలీ ఫ్లోర్స్‌ను కిడ్నాప్ చేసి తీసుకుపోయింది. నార్కో టెర్రరిస్టు అని అభియోగం మోపి న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టింది. తాను వెనిజులా అధ్యక్షుడినని, ఎలాంటి నేరం చేయలేదని మదు రో కోర్టులో చెప్పాడు. తదుపరి ఏం జరుగుతుందో తెలియదు. తామే వెనిజులాను నడిపిస్తామని ట్రంప్ ప్రకటించాడు. ఏ న్యాయశా స్త్రంలో నూ ఒక దేశాన్ని మరో దేశం నడిపించటం గురించి మనకు కనపడదు. ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. తమకు సహకరించకపోతే మదురో కంటే ఎక్కువగా అనుభవించాల్సి వస్తుందని ట్రంప్ ఆమెను బెదిరించాడు. ఆర్థిక, రాజకీయ "సంస్కరణలు" చేపట్టాలని, అందుకు వెనిజులా పూర్తిగా సహకరిస్తుందంటూ విదేశాంగ మంత్రి మార్కో రూబియోను ట్రంప్ ఆదేశించాడు. ఒక పెద్ద బృందం అక్కడికి వెళ్లనుందని సలహాదారు స్టీఫెన్ మిలర్ చెప్పాడు. దీనంతటిఅసలు ఉద్దేశం వెనిజులా లోని చమురు నిక్షేపాలను ఆక్రమిం చుకోవడం. అమెరికా చర్యను ఐరాస ఖండించింది. ప్రపంచ ప్రజాస్వా మ్యానికి మాతృమూర్తి వంటిది భారత్ అనిచెబుతున్న ప్రధాని నరేంద్ర మోడీఈ దుర్మార్గాన్ని ఖండించకుండా మౌన ముద్ర దాల్చారు. తాను భారత్‌పట్లసంతోషంగా లేననిట్రంప్ ప్రకటించాడు. అతగాడిని "సంతుష్టి కరించేందుకే" మౌన దౌత్యమా! మొత్తానికి మోడీ అమెరికా పట్ల వ్యవహరిస్తున్న తీరు అలీన విదేశాంగ విధానానికి పూర్తి వ్యతిరేకమైనది. మదురోను ఎలా పట్టుకున్నారు, అందుకు అనుసరించిన పద్ధతేమిటి అనేఅంశాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. కొన్ని నెలల పాటు మదురో నివశించే భవనం లాంటిదే ఒకటి ఏర్పాటు చేసి రెక్కీ నిర్వహించారని, మదురో సిబ్బందిని ప్రలోభపెట్టి వివరాలు తెలు సుకున్నట్లు చెబుతున్నారు. అపహరణ సమయ ంలో జరిగిన ప్రతిఘటనలో 80 మంది మరణిం చారని, వారిలో 32 మంది క్యూబన్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగజ్, ఆమె సోదరుడు జార్జి ఇద్దరూ వామపక్ష గెరిల్లా కుటుంబం నుంచి వచ్చిన వారే. మదురో పాలకుడైతే జార్జి విధానాల రూపకల్పనలో భాగస్వామిగా ఉన్నాడు. వారి తండ్రి జార్జి ఆంటోనియో రోడ్రిగజ్ 1970వ దశకంలో వెనిజులా నిరంకుశత్వాన్ని వ్యతిరేకిం చిన గెరిల్లా పోరాట యోధుడు. అతన్ని పట్టుకొని పోలీసులు కస్టడీలో చంపివేశారు. డెల్సీ అమెరికా విదేశాంగ మంత్రితో సంబంధాలు కలిగి ఉన్నారనే వార్తలు వచ్చాయి. ఇవి ఛావెజ్ అభిమానుల్లో అనుమానాలు రేకెత్తించటానికి ఎత్తుగడగా వ్యాపింపచేసినవి కూడా కావచ్చు. చరిత్రను చూస్తే ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి ప్రపంచానికి నిత్యం నీతి సూత్రాలను బోధించే అమెరికా అడుగడుగునా వాటిని ఉల్లంఘించిన ఉదంతాలు కోకొల్లలు. అది సమర్ధించని నియంతలు లే రు, మారణకాండ లేదు. తమ దారికి రాని వారిని ఏం చేస్తామో ఇది ప్రారంభం మాత్రమే అని మదురో అపహరణ తరువాత ట్రంప్ చెప్పాడంటే రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో, ప్రపంచా నికి ఎలాంటి ముప్పురానుందో! రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జర్మన్ హిట్లర్ యూదుల మారణకాండకు పాల్పడినా, అనేక దేశాలను ఆక్రమించుకోవటం ప్రారంభించినా "ప్రజాస్వామిక ముసుగు" వేసుకు న్న దేశాలేవీ అడ్డుకోలేదు, అమెరికా ఆయుధాలు కూడా అందించింది. సోవియట్ కమ్యూనిస్టుల మీదకు వెళ్లినపుడు సోషలిస్టు వ్యవస్థను అంతం చేస్తాడని కమ్యూనిస్టు వ్యతిరేకులందరూ ఆనందించారు. ఉక్కు మనిషి స్టాలిన్ నాయకత్వంలో ప్రతిఘటించి చుక్కలు చూపించిన తరువాత హిట్లర్ ఆత్మహత్య చేసుకొని దిక్కులేని చావు చచ్చాడు. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ రూపంలో ఉన్న అమెరికన్ ఫాసిస్టు శక్తిని నిలువరించేది ఎవరు ? తదుపరి లక్ష్యం మెక్సికో, కొలంబియా, క్యూబా అని కూడా ట్రంప్ చెప్పాడు. అది అక్కడితోనే ఆగదు. రెండవ ప్రపంచ యుద్ధంతో భౌతిక వలసలు సాధ్యం కాదని గ్రహించిన సామ్రాజ్యవాదులు ప్రపంచీకరణ పేరుతో మార్కెట్లను స్వాధీనం చేసుకొనేందుకు చూశారు. అది కూడా సాధ్యం కాదని అనుభవం తేల్చింది. అందుకుగాను అంతకు ముందు నాటి ఆక్రమణలు మినహా మరో మార్గం లేదని, గతంలో తమ పెరటి తోటగా పరిగణించిన లాటిన్ అమెరికాతోనే ప్రారంభం అని వెనిజులా ఉదంతం స్పష్టం చేసింది. అంతకు ముందు డెన్మార్క్ స్వయంపాలిత గ్రీన్‌లాండ్ తమకు కావాలని చెప్పిన సంగతి తెలిసిందే. ఏది కావాలంటే దాన్ని స్వాధీనం చేసుకొనే ట్రంప్ తరహా సామ్రాజ్యవాదంగా చరిత్రలో నమోదైంది. ప్రస్తుతం ప్రపంచంలో అస్థిర పరిస్థితి రోజు రోజుకూ పెరుగుతున్నట్లుగా ఉంది. ఉక్రెయిన్, పాలస్తీనాలోని గాజా, వెస్ట్ బ్యాంక్, కాంగో, సిరియా, లిబియాల్లో జోక్యం, గాజాలో ఇజ్రాయిల్ మారణకాండకు మద్దతు, ఇరాన్‌పై దాడి, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో పరాభవం. మొత్తం మీద ప్రపంచంలో విలువైన వనరులను చేజిక్కించుకొనేందుకు అడ్డగోలు చర్యలకు పాల్పడుతున్న అమెరికా తీరు ఇటీవలి కాలంలో మరింతగా ప్రపంచానికి తేటతెల్లమైంది.

విలేకరులు కావలెను

రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక

డీకే సారథ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించండి:
సెల్: 9603754136 - 7386287837

# శాకాంబరుడిగా రుద్రేశ్వరుడు



హన్మకొండ (డి. కె. చాటింపు )చారిత్రక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయంలో ఆషాడ శుద్ధ పౌర్ణమి గురు పౌర్ణమి పురస్కరించుకొని ఉదయం ప్రాత క్కాల నిత్యహన్నిక కార్యక్రమాలు నిర్వర్తించి రుద్రేశ్వరునికి రుద్రాభిషేకం అనంతరం గ్రామాల నుండి కొంత మంది రైతులు సమర్పించిన కూరగాయలు బీర టమాట ఆలు మునక్కాయ సొరకాయ వంకాయ దొండకాయ మిర్చి కొత్తిమీర పుదీనా కరివేపాకు పుదీనా గుమ్మడికాయ క్యారెట్ దోసకాయ గోరుచిక్కుడుకాయ బిన్నీసు ప్రకృతి సహజమైన. కూ రగాయలు తమ పెరట్లో పండించిన వస్తువులను తీసుకువచ్చి క్వింటాల్ కూరగా యలు సమర్పించడం వలన వాటిని రుద్రేశ్వర స్వామికి దండల రూపంలో అలంకరించడం జరిగినది. శాకంబరునిగా అలంకరించి పంచసూక్తములతో పూజలు నిర్వహించడం జరిగినది వర్షాలు ప్రారంభం అయినందున నాగల్లుబట్టి దుక్కి దున్నే సమయం వచ్చినందున ఆ పరమేశ్వరుని ప్రీతికరంగా పంచభూతాత్మకుడైన పరమేశ్వరుడు మేఘాలను వర్షిస్తున్నందున స్వామి వారికి కృతజ్ఞతగా రైతులు సమర్పించిన కూరగాయలతో పూజించడం జరిగినది వర్షం పడుతున్న భక్తులు దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకోవడం జరిగినది ప్రకృతి పరవశిస్తున్నందున మేఘాలు వర్షిస్తున్నందున రైతుల కళ్ళల్లో ఆనందాలు కనబడ్డాయి భక్తులందరికీ ప్రసాద పంపిణీ చేయడం జరిగినది. ఈరోజు పూజా కార్యక్రమంలో దేవాదాయ శాఖ మాజీ కమిషనర్ అనిల్ కుమార్ సతీమణి పద్మజ వరంగల్ వాసి సంగీత కళాకారి ని మరియు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ వేద పండితులు మణికంఠ శర్మ ప్రణవ్ శ్రవణ్ రుద్రేశ్వర సేవా సమితి సభ్యులు శ్రీనివాస్ జ్యోతి ఆంజనేయులు భునగిరి మాధవరావు వంశీ తదితరులు కూరగాయలు సమర్పించిన వారిలో ఉన్నారు దేవాలయంలో ఆధ్యాత్మిక భావం విరాజిల్లింది భక్తులంతా కూడా శివ పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ స్వామి వారిని దర్శించుకున్నారు ఆలయ ఈవో అనిల్ కుమార్ ఏర్పాటను పర్యవేక్షించారు

## మహిళా సమైక్య భవనానికి
# శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



జనగామ/పాలకుర్తి జులై 29 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి పసునూరి దేవేందర్:గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారులు,మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశశ్వినిరెడ్డి అన్నారు. బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్ పహాడ్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ మేరకు గ్రామంలో మౌలిక వసతుల విస్తరణకు మహిళల సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ పలు నిర్మాణ పనులను ప్రారంభించడం తో పాటు రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు,అలాగే రూ. 10 లక్షల వ్యయంతో మహిళా సమైక్య భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తూ గ్రామాల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పారిపెల్లి బాలమ్మ శ్రీనివాస్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్,జిల్లా నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండుకృష్ణ,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్,మండల ఎస్సి,మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు,మహ్మద్ రసూల్,ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,గ్రామ శాఖ అధ్యక్షుడు దావుల యాకయ్య,మండల,గ్రామ నాయకులు,రెడ్డి రాజుల రమేష్,ఓడపెల్లి రవి,మహ్మద్ జాకిర్,మొటికే చంద్రశేఖర్,తోటకూరి రవేష్,లీనారెడ్డి,రాజేందర్,యువజన నాయకులు,ప్రజాప్రతినిధులు,సంబంధిత శాఖ అధికారులు,మహిళా సంఘాల సభ్యురాళ్లు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఇనిస్టిట్యూట్ లో ఇంకుడు గుంతలు తప్పని సరిగా నిర్మించుకోవాలి
### - ప్రతి ఇనిస్టిట్యూట్ లో ఇంకుడు గుంతలు తప్పని సరిగా నిర్మించుకోవాలి
### మహేందర్ నాయక్ జీఎం జలమండలి




ఎల్బీనగర్, జులై29, డీకే చాటింపు:- భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం కోసం కామినేని హాస్పిటల్ ప్రాంగణంలో ఇంకుడు గుంతల కోసం భూమి పూజ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జలమండలి జిఎం మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి డాక్టర్ జాల సత్యనారాయణ విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ప్రతి ఇంట్లో, ఇనిస్టిట్యూట్ లో తప్పని సరిగా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. భారీ ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టినందుకు కామినేని హాస్పిటల్ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్ లో ఎండిన బోర్ ను ఇంజక్షన్ వెల్ క్రింద మార్చేందుకు కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ తో పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కామినేని హాస్పిటల్ అడ్మిన్, సీఈవో గోకుల్ రఘురాం, గ్రూప్ హెడ్ కొడతాల సత్యనారాయణ, డిజిఎం టి సాయినాథ్, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ టి సురేందర్, మేనేజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


## పిల్లలకు కెరియర్ కౌన్సిలింగ్ మరియు గైడెన్సీ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్



ఎల్బీనగర్, జూలై 29 (డీకే చాటింపు):డాక్టర్స్ కాలనీ డివిజన్ వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 5 నందు కమ్యూనిటీ హాల్ లో ఎయిడె ఎట్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలోని ఎన్టైట్ ప్రాజెక్ట్ సంస్థ సహకారంతో పిల్లలకు కెరియర్ కౌన్సిలింగ్ మరియు గైడెన్సీ జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి పాల్గొని చదువు యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పడం జరిగింది. ఈ ప్రోగ్రాం లో ఎయిడె ఎట్ యాక్షన్ సంస్థ 35 మంది ఆడ పిల్లలకు ఎడ్యుకేషన్ మెటీరియల్ సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ జంగా రెడ్డిలి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నహీం భాయ్,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అశ్విని , కమ్యూనిటీ ఆర్గనైజర్ నాగమణి ,శ్యామల మరియు లివిజయ కుమారి పాల్గొనడం జరిగింది.

# భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ మహోత్సవం





మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా (డీకే చాటింపు) హైదరాబాద్‌లోని ఉప్పల్ సరస్వతి నగర్ కాలనీలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో బుధవారం 37వ గురుపూర్ణిమ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 4.30కి ప్రభాత సేవ, 5 గంటలకు కాకడ హారతి, 6 గంటలకు గణపతి పూజ, కలశారాధన, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ ప్రత్యేక పూజ, 9 గంటలకు శ్రీసాయి సచ్చరిత్ర సామూహిక పారాయణ, మహానివేదన జరిగాయి. మధ్యాహ్నం 12.10కి మధ్యాహ్న హారతి, ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు శ్రీ బాబా వారి పాదుకలతో పల్లకీ సేవ, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ, 6 గంటలకు ధూప్ సంధ్యా హారతి, రాత్రి 9 గంటలకు శేజ్ హారతి, అనంతరం తీర్థప్రసాద వినియోగం చేశారు. భక్తులు, స్థానిక నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బెల్లంపల్లి సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా జాడి మహేశ్వర్ ఎన్నిక



బెల్లంపల్లి(డీకే చాటింపు ) బెల్లంపల్లి మండల పరిధిలోని సర్పంచుల సంఘం అధ్యక్షులు గా బుచ్చయ్య పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ జాడి మహేశ్వర్ ను ఎన్నుకున్నారు. ఈ మేరకు సర్పంచ్ లు మహేశ్వర్ ను అధ్యక్షున్ని శాలువాతో సత్కరించారు కప్పినాడు. సర్పంచ్ ల కమిటీ ఉపాధ్యక్షుడిగా:జరుకుల సాయికిరణ్,జనరల్ సెక్రెటరీగా సుధామల్ల వెంకటి,బొంతల అరుణ,కోశాధికారిగాజుమ్మిడి లలిత, ను ఎన్నుకున్నారు

## గురువు చూపిన మార్గమే జీవితానికి వెలుగు
## గురుపూర్ణిమ శుభాకాంక్షలు తెలిపిన తోట మహేష్ యాదవ్



ఎల్బీనగర్, జూలై 29 (డీకే చాటింపు):ఈ పవిత్రమైన గురుపూర్ణిమ సందర్భంగా ఫణిగిరి కాలనీలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో తోట మహేష్ యాదవ్ గ స్వామివారిని దర్శించుకుని, వారి దివ్య ఆశీర్వాదాలను పొందడం జరిగింది. "గురువు చూపిన మార్గమే జీవితానికి వెలుగు... దైవ ఆశీస్సులే మన ప్రయాణానికి బలం." ఆలయ కమిటీ వారు శ్రీనివాస్ నాయుడు గారు మరియు కమిటీ సభ్యులు శ్రీ తోట మహేష్ యాదవ్ గారిని శాలువా తో సత్కరించడం జరిగింది సాయిబాబా వారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కారిక్రమంలో శ్రీశైలం యాదవ్ వెంకటేశ్వర్లు ప్రభాకర్ నర్సింహ రెడ్డి రాజేష్ బాలు గణేశ్ మరియు కాలిని వాసులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తోగురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు సాంటి చంద్రశేఖర్ రెడ్డి



ఎల్బీనగర్ జూలై 29 (డీకే చాటింపు) :గురు పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో గురు పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే సుధీరన్నతో కలిసి దిల్ సుఖ్ నగర్ సాయిబాబా గుడిలో బాబాను దర్శనం చేసుకోవడం జరిగింది, అలాగే చైతన్యపురి డివిజన్ లోని వెంకట సాయి నగర్ కాలనీలోని సాయిబాబా గుడిలో బాబాను దర్శనం చేసుకోవడం జరిగింది.. ఈ కార్యక్రమంలో గుడి ఫౌండర్ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, నాయకులు ప్రభాకర్ అన్న,నవీన్, టింకు,గణేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ప్రజలపై పర్యావ'రణం'
# ఇది నేల కోతకు సంకేతం

మానవాళి అభివృద్ధిలో పర్యావరణానిది కీలకపాత్ర. అది ఎంత ఆరోగ్యంగా ఉంటే, మనం కూడా అంత ఆరోగ్యంగా ఉంటాం. మన చుట్టూ ఉన్న జీవ, నిర్జీవ అంశాలన్నింటినీ పర్యావరణం అంటారు. పర్యావరణ ఆరోగ్యం అనేది ప్రజారోగ్యంలోని అతిపెద్ద రంగాలలో ఒకటి. ఒక ప్రాంతంలోని భౌతిక, రసాయన, సాంస్కృతిక వాతావరణం, ఆ ప్రాంత పర్యావరణ ఆరోగ్యాన్ని సూచిస్తుంది. ఇది ఆ ప్రాంతంలోని కాలుష్య స్థాయి, జీవావరణ వైవిధ్యం, పరిశుభ్రమైన తాగునీరు లభ్యత, పారిశుధ్య పరిస్థితులు, వ్యవసాయ ఉత్పాదకత వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. పర్యావరణ సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.6 కోట్లకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదించింది. అంతేకాక, వందకు పైగా అనారోగ్యాలు పర్యావరణ ఆరోగ్య సమస్యలతో నేరుగా ముడిపడి ఉన్నాయని కూడా ఆ నివేదిక పేర్కొంది. 155 దేశాలు తమ పౌరులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే హక్కును కల్పించినప్పటికీ, భూమి, గాలి, నీరు, రసాయన కాలుష్యం వంటి "పర్యావరణ ప్రమాదాల" వల్ల 23 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. పర్యావరణ మార్పులు ప్రజల జీవనోపాధికి, ఆహార భద్రతకు ముప్పు తెస్తున్నాయి. ప్రపంచంలోని అతిపెద్ద పర్యావరణ సమస్యలలో వాయు కాలుష్యం ఒకటి. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 42 లక్షల నుంచి 70 లక్షల మంది మరణిస్తున్నట్లు అంచనా. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రతి పది మందిలో తొమ్మిది మంది అధిక కాలుష్య కారకాలను కలిగి ఉన్న గాలిని పీల్చుకుంటున్నారు. నేడు ఢిల్లీ పరిస్థితి చూశాం. ప్రజలు ఇంట్లో కూడా మాస్కుతోనే జీవిస్తున్నారు. వీరిని కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులదే కదా. మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, భూమిపై సముద్ర మట్టం సంవత్సరానికి సగటున 3.2 మి.మీ పెరుగుతోంది. ఈ శతాబ్దం చివరి నాటికి అది దాదాపు 0.7 మీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పెరుగుదల వల్ల సముద్ర తీర ప్రాంతాలు ముంపునకు గురై, సుమారు 34 కోట్ల నుంచి 48 కోట్ల మంది సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుంది. ప్రతి గంటకు 300 ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో అడవులు నరికివేయబడుతున్నాయి. ఇలాగే కొనసాగితే, 2030 నాటికి ఇ ప్పుడున్న అడవులలో కేవలం పదిశాతం మాత్రమే మిగిలి ఉండవచ్చు. మహాస ముద్రాలు భూమి వాతావరణంలోకి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్‌లో 30శాతం గ్రహిస్తాయి.

# హైదరాబాద్‌లో 'ట్రౌట్' చేపల సాగు కేంద్రం

రంగారెడ్డి,: హైదరాబాద్ శివారులో రెయిన్‌బో ట్రౌట్ చేపల పెంపకానికి సరికొత్త అధ్యాయం మొదలైంది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత ఫారమ్‌ను కేంద్ర మంత్రి ప్రారంభిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో వేడి వాతావరణంలోనూ శీతల నీటి చేపల పెంపకాన్ని ఇది సాధ్యం చేస్తుంది. గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకా శాలు మెరుగుపడతాయి.మత్స్య పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి హైదరాబాద్ వేదికవుతోంది. సాధారణంగా హిమాలయాలు, శీతల పర్వత ప్రాంతాలకే పరిమితమైన 'రెయిన్‌బో ట్రౌట్' చేపలను.. ఇప్పుడు దక్షిణ భారతదేశపు ఉష్ణమండల వాతావరణంలో పెంచబోతున్నారు. దేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఫారమ్‌ను కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు (జనవరి 5) ప్రారంభించనున్నారు.రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు చేపల సాగు అనేది ఆయా ప్రాంతాల వాతావరణంపై ఆధారపడి ఉండేది. కానీ ఈ ప్రాజెక్ట్ ఆ అంచనాలను తలకిందులు చేసింది.

అత్యాధునిక ప్రెసిషన్ ఇంజనీరింగ్ , నీటిని నిరంతరం శుద్ధి చేసే వాటర్ రీసర్క్యులేషన్ సాంకేతికతతో హైదరాబాద్ వంటి వేడి వాతావరణంలో కూడా ఏడాది పొడవునా శీతల నీటి చేపలను పెంచవచ్చని ఈ సంస్థ నిరూపించింది. వాతావరణం కంటే సాంకేతికతే సాగుకు ప్రాధాన్యతనిస్తుందని ఈ కేంద్రం చాటిచెప్పనుందికేవలం ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా పరిశోధనా సంస్థగా కూడా పనిచేయనుంది. గ్రామీణ యువతకు, విద్యార్థులకు ఆటోమేషన్, బయోసెక్యూరిటీ, ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులపై ఇక్కడ ప్రత్యక్ష శిక్షణ ఇస్తారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా, నూతన పారిశ్రామికవేత్తలు తయారయ్యే అవకాశం ఉంది. మత్స్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఇప్పటివరకు సుమారు రూ. 38,572 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా కోల్డ్ వాటర్ ఫిషరీస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలకే పరిమితమైన ఈ సాగును ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు



# సులభంగా.. ఏసీ శుభ్రం!

ఏటికేడు వేసవి ఉష్ణోగ్రతలూ పెరిగిపోతున్నాయి. దాంతో, ఫ్యాన్లూ కూలర్లు పక్కన పడేసి.. ఎయిర్ కండిషనర్లు కొనాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఒకప్పుడు ఉన్నత వర్గాలకే పరిమితమైన ఏసీలు.. ఇప్పుడు మధ్యతరగతి ఇళ్లలోనూ కొలువుదీరుతున్నాయి. అయితే, ఏసీలను ఎక్కువశాతం మంది ఏడాదిలో మూడునాలుగు నెలలు మాత్రమే వినియోగిస్తుంటారు. వేసవి ముగియగానే.. వాటిని ఆన్ చేయడమే మర్చిపోతారు. మళ్లీ మార్చి నుంచే.. ఏసీల వాడకం మొదలుపెడతారు. ఏసీని మళ్లీ వాడాలంటే.. మొదటగా దాన్ని క్లీన్ చేయాలి. నిజానికి ఆయా సంస్థల టెక్నీషియన్లతోనే ఏసీలను సర్వీసింగ్ చేయించుకుంటే మంచిది. అదనపు ఖర్చు ఎందుకని, మీరే క్లీన్ చేసుకోవాలని అనుకుంటే.. కొన్ని విషయాలను మాత్రం తప్పకుండా ఫాలో కావాలి. విండో ఏసీ, స్లిట్ ఏసీ.. రెండిటిలోనూ 'ఫిల్టర్' అత్యంత ముఖ్యమైనది. వీటితోనే ఏసీ బాగా పనిచేస్తుంది. మంచి కూలింగ్ రావాలంటే.. ఫిల్టర్ బాగుండాల్సిందే! అయితే, ఏసీ ఫిల్టర్లను శుభ్రం చేసేటప్పుడు కొందరు చిన్నచిన్న తప్పులు చేస్తుంటారు. దాంతో ఫిల్టర్లు దెబ్బతిని, పాడైపోతాయి. వాటిని బాగు చేయించాలంటే.. చాలా ఖర్చు కూడా! కాబట్టి, ఏసీ దెబ్బతినకుండా ఉండాలంటే తగిన సూచనలు పాటించాలి. ఏసీ ఫిల్టర్లను ప్రతి రెండు వారాలకు ఒకసారి శుభ్రం చేస్తుండాలి. ఇందుకోసం వాక్యూమ్ క్లీనర్‌ను వాడటం మంచిది. దీనికి సున్నితంగా ఉండే బ్రష్‌ను అటాచ్ చేసుకొని, ఫిల్టర్‌ను క్లీన్ చేసుకుంటే ఇట్టే శుభ్రమవుతాయి. గోరువెచ్చని నీటిలో తేలికపాటి డిటర్జెంట్ లేదా డిష్ సోప్ కలిపి ఫిల్టర్‌ను శుభ్రం చేయాలి. ఆ తర్వాత శు



భ్రమైన నీటితో కడిగి.. గాలికి ఆరనివ్వాలి. ఒక స్ప్రే బాటిల్‌లో వేడినీళ్లు, లిక్విడ్ సోప్ కలిపి.. ఏసీ కాయిల్స్‌ను శుభ్రం చేయడానికి వాడుకోవాలి. దీంతో కాయిల్స్ పూర్తిగా శుభ్రమవుతాయి. ఏసీ నెట్‌పై పేరుకుపోయే దుమ్ముధూళిని తొలగించడంలో బ్లోయర్ లేదా వాక్యూమ్ క్లీనర్ సమర్థంగా పనిచేస్తుంది.

ఈ తప్పులు చేయకండి: ఏసీలను శుభ్రం చేయడానికి వాషింగ్ డిటర్జెంట్‌ను ఉపయోగించకూడదు. ఇది ఏసీ ఫిల్టర్‌ను దెబ్బతీస్తుంది. ఏసీ ఫిల్టర్ చాలా సన్నగా, సున్నితంగా ఉంటుంది. గట్టిగా ఉండే బ్రష్‌తో వీటిని శుభ్రం చేయాలని ప్రయత్నిస్తే.. అవి పాడయ్యే ప్రమాదం ఉంటుంది. బట్టలు ఉతికే బ్రష్ కూడా.. ఏసీ ఫిల్టర్‌కు హాని కలిగిస్తుంది. ఎక్కువ దారాలు ఉండే వస్త్రాన్ని ఉపయోగించినా.. ఏసీ ఫిల్టర్ దెబ్బతింటుంది. ఫిల్టర్‌ను శుభ్రం చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. అది గోడకైనా, నేలకైనా తగిలితే.. ఏసీ ఫిల్టర్ పాడవుతుంది.

# సిటీ చుట్టూ రేడియల్ రింగ్



హైదరాబాద్, : హైదరాబాద్ తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జలమండలి 8 వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పేరుతో ప్రధాన పైపులైన్ వ్యవస్థను నిర్మించనున్నారు. కృష్ణా, గోదావరి, మంజీరా వంటి అన్ని నీటి వనరులను ఈ రింగ్ మెయిన్‌తో అనుసంధానం చేస్తారు. దీనివల్ల ఏదైనా ఒక ప్రాంతంలో పైపులైన్ పాడైతే.. మరో మార్గం ద్వారా నీటిని మళ్లించి సరఫరాకు అంతరాయం లేకుండా చేయవచ్చు. నగరమంతటా 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తోంది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా.. నగరంలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి కరువు లేకుండా చూడాలని జలమండలి నడుం బిగించింది. దీని కోసం సుమారు 8 వేల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఒక ప్రత్యేకమైన తాగునీటి ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరానికి నలుదిశల నుండి వచ్చే నీటి వనరులను ఒకదానితో ఒకటి కలిపేలా ఒక భారీ నెట్‌వర్క్‌ను నిర్మించడమే ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశం.సాధారణంగా నగరానికి ఒక్కో వైపు నుండి ఒక్కో నది లేదా రిజర్వాయర్ నీరు వస్తుంది. అయితే.. ఏదైనా ఒక పైపులైన్ పాడైతే ఆ ప్రాంతానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. ఇలాంటి సమస్య రాకుండా ఉండటానికి, నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర ఒక పెద్ద రింగు లాంటి ప్రధాన పైపులైన్‌ను ఏర్పాటు చేస్తారు. దీనినే 'రేడియల్ రింగ్ మెయిన్' అని పిలుస్తారు. దీనికి అదనంగా మరో 96 కిలోమీటర్ల మేర చిన్న పైపులైన్ల ద్వారా నగరంలోని వివిధ వాటర్ ట్యాంకులకు కనెక్షన్ ఇస్తారు.ప్రస్తుతం హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నదులతో పాటు సింగూరు, మంజీరా.. జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి తాగునీరు అందుతోంది. ఈ కొత్త ప్రాజెక్టు వల్ల ఈ నీటి వనరులన్నీ ఒకే వ్యవస్థతో అనుసంధానం అవుతాయి. ఉదాహరణకు మంజీరా పైపులైన్‌కు రిపేర్లు వస్తే.. వెంటనే అదే రింగ్ మెయిన్ ద్వారా గోదావరి లేదా కృష్ణా జలాలను ఆ ప్రాంతానికి మళ్లించవచ్చు. నగరం చివరన ఉన్న ప్రాంతాలకు కూడా సమానమైన నీరు అందుతుహైదరాబాద్ ప్రజలకు రోజులో ఎప్పుడైనా నీరు వచ్చేలా (24/7 నీటి సరఫరా) చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రింగ్ మెయిన్ వ్యవస్థ ఎంతో అవసరం. రాబోయే రెండేళ్లలో గోదావరి రెండు, మూడు దశల పనులు కూడా పూర్తవుతాయి. ఆ నీటిని కూడా ఈ రింగ్ మెయిన్‌కు కలిపితే.. భవిష్యత్తులో నీటి ఎద్దడి అనే మాట వినిపించదు.పాత పైపులైన్లు తరచూ పగిలిపోవడం వల్ల నీరు వృథా కావడమే కాకుండా... మరమ్మతులు చేసే వరకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ కొత్త పైపులైన్లు వేయడం వల్ల నిర్వహణ కూడా సులభం అవుతుంది. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు రాబోయే 50 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

# ఎక్కువైతే ముప్పే!



ఎండ మండిపోతున్నది. ఇలాంటి వేడి వాతావరణంలో చల్లచల్లని పానీయాలు తాగాలనిపిస్తుంది. ముఖ్యంగా, చెరకు రసం.. అమృతంలా కనిపిస్తుంది. అందుకు తగ్గట్టు అనేక ప్రయోజనాలనూ అందిస్తుంది. అయితే, వేసవితాపం నుంచి ఉపశమనం ఇస్తుందని గ్లాసులకు గ్లాసులు తాగేయడం ఏమంత మంచిదికాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐసీఎంఆర్ కూడా ఇదే చెబుతున్నదని అంటున్నారు. నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్, ఇంగ్లాండ్) సూచనల ప్రకారం.. పెద్దవాళ్లు రోజుకు 30 గ్రా. కంటే ఎక్కువ చక్కెరను తీసుకోవద్దు. 7 నుంచి 10 ఏళ్ల పిల్లలు 24 గ్రా. కంటే తక్కువగా, 4 నుంచి 6 ఏళ్ల పిల్లలు 19 గ్రా. కన్నా తక్కువగా చక్కెరను తీసుకోవాలి. ఆ పరిమితి దాటితే.. ఆరోగ్యానికి హానికరం. అయితే, 100 మి.లీ చెరకు రసంలో 13 నుంచి 15 గ్రా. చక్కెర ఉంటుందని పరిశోధనల్లో తేలింది. ఈక్రమంలో రోజుకు రెండుగ్లాసుల చెరకు రసం తీసుకున్నా.. 400 – 450 మి.లీ తాగినట్లే! ఈ లెక్కన శరీరంలోకి 45 – 50 గ్రా. చక్కెర చేరుతుంది. ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) కూడా ఇదే విషయం వెల్లడించింది.

పరిమితి ఉంటేనే..: చెరకు రసం ఆరోగ్యానికి అనేక రకాలుగా మేలుచేస్తుంది. అయితే, పరిమితి దాటితే.. అనారోగ్యం కలుగుతుంది. చెరకు రసంలో కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్, ఐరన్, పొటాషియం, భాస్వరం, కాల్షియం, మెగ్నీషియం, యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి.. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి. జీర్ణ సమస్యలతోపాటు మలబద్ధకాన్నీ నివారిస్తాయి. దంతాలు, ఎముకలకు బలాన్ని ఇస్తాయి. చెరకు రసం.. అధిక రక్తపోటు ప్రమాదాన్ని తగ్గించి, గుండె ఆరోగ్యానికి భరోసా ఇస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తుంది.

# వలయాలను వదిలించుకోండి



పెరుగుతున్న స్క్రీన్ టైమ్ వల్ల.. కళ్లు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఎండలు, విటమిన్ల లోపం కూడా.. కళ్లకింద నల్లటి వలయాలకు కారణం అవుతున్నాయి. ఈ చిట్కాలు పాటిస్తే.. నల్లటి వలయాలు వదిలిపోతాయి. ఒక టీస్పూన్ నిమ్మరసానికి, కొద్దిగా కీరదోస రసం, చిటికెడు పసుపు కలిపి.. డార్క్ సర్కిల్స్‌పై అప్లయి చేయాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. అయితే, ఈ మిశ్రమం కళ్లలోకి పోకుండా చూసుకోవాలి. ఒక టీస్పూన్ శనగపిండిలో కొద్దిగా పసుపు, టమాట రసం వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీనిని కంటి చుట్టూ అప్లయి చేసి.. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. డార్క్ సర్కిల్స్‌ను తగ్గించడంలో రోజ్ వాటర్ ముందుంటుంది. రాత్రి పడుకునే ముందు రోజ్‌వాటర్‌ను కళ్లపై అప్లయి చేసి.. సున్నితంగా మర్దనా చేయాలి. దీనివల్ల డార్క్ సర్కిల్స్ తగ్గడంతోపాటు కళ్లకు చల్లదనం లభిస్తుంది. కాటన్ బాల్స్‌ను రోజ్ వాటర్‌లో ముంచి.. కళ్లపై పెట్టుకోవాలి. 10 నిమిషాల తర్వాత తీసేయాలి. ఇలారోజూ చేస్తే మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి. విటమిన్ ఇ నూనె, కొబ్బరినూనె, ఆలివ్ నూనె మూడింటినీ కలిపి రాత్రి పడుకునే ముందు.. కళ్ల చుట్టూ అప్లయి చేయాలి. వేళ్లతో సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. తెల్లారేసరికి చర్మం మరింత కాంతిమంతంగా కనిపిస్తుంది.

# ఆలస్యం.. విషం!

'ఆలస్యం అమృతం విషం!'.. అనే సూత్రం భోజనం విషయంలోనూ వర్తిస్తుందని చెబుతున్నారు ఆహార నిపుణులు. ఉరుకుల పరుగుల జీవితాలు, రాత్రి విధులు, పార్టీలు.. ఇలా పలు కారణాల వల్ల చాలామంది రాత్రి భోజనాన్ని ఆలస్యంగా ముగిస్తున్నారు. ఇలాంటి అలవాటు ఆరోగ్యానికి ఏమాత్రం మంచిదికాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి భోజనం లేటైతే.. పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని చెబుతున్నారు. ఆలస్యంగా తినే ఆహారం.. త్వరగా జీర్ణమవ్వదు. దీంతో గ్యాస్, అసిడిటీ, కడుపుబ్బరం వంటి జీర్ణ సంబంధ సమస్యలు ఎదురవుతాయి. ఇక ఇలా భోజనం చేసి, అలా పడుకొంటే.. నిద్రకు ఆటంకం కలుగుతుంది. జీర్ణక్రియ కూడా నెమ్మదిస్తుంది. అర్ధరాత్రి భోజనం చేయడం కొందరికి అలవాటు. దీర్ఘకాలంలో ఈ అలవాటు గుండెకు హాని కలిగిస్తుంది. ఇక ఆహారం తీసుకోకపోవడం ఆలస్యమైతే.. జీవక్రియ మందగిస్తుంది. ఫలితంగా



శరీరంలో కొవ్వు పెరగడం మొదలై.. ఊబకాయం బారినపడే ప్రమాదం ఉంటుంది. రాత్రిపూట కొవ్వులు, చక్కెరతో కూడిన ఆహారం ఎక్కువగా తీసుకుంటే.. పేగు క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయడం హార్మోన్ల అసమతుల్యతకూ దారితీస్తుంది. మానసిక ఒత్తిడి, డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలను తెచ్చిపెడుతుంది.

# మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలకు బదులుగా ఈ డ్రింక్స్‌ను తాగండి..



చాలా మంది ఉదయం నిద్ర లేచిన వెంటనే తమ రోజును టీ లేదా కాఫీతో ప్రారంభిస్తారు. కొందరు రోజు మొత్తం టీ లేదా కాఫీలను అదే పనిగా తాగుతుంటారు కూడా. అయితే టీ, కాఫీలను మోతాదుకు మించి తాగితే ఆరోగ్యానికి చేటు చేస్తాయి. శరీరంలో కెఫీన్ స్థాయిలు పెరిగిపోతాయి. ఇది అనేక అనారోగ్యాలకు దారి తీస్తుంది. శరీరంలో కెఫీన్ పెరిగితే జీర్ణ సమస్యలు వస్తాయి. గుండె దడగా ఉంటుంది. బీపీ పెరిగిపోతుంది. రాత్రిపూట నిద్ర సరిగ్గా పట్టదు. ఇలా శరీరంలో అధికంగా ఉండే కెఫీన్ మనకు అనేక రకాలుగా హాని చేస్తుంది. అయితే టీ, కాఫీ తాగకపోతే ఎలా..? వాటిని తాగకుండా ఎలా ఉండగలం..? అని అనుకునే వారు ఇప్పుడు చెప్పబోయే పలు డ్రింక్స్‌ను తాగవచ్చు. వీటిని టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా సేవించవచ్చు. వీటిల్లో ఎలాంటి హానికర సమ్మేళనాలు ఉండవు. కనుక ఈ డ్రింక్స్‌ను తాగితే ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు.

**గ్రీన్ టీ..:** టీ, కాఫీలకు బదులుగా గ్రీన్ టీని తాగడం అలవాటు చేసుకోండి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. శరీరంలోని కొవ్వు కరిగిపోతుంది. అధిక బరువు తగ్గుతారు. కమోమిల్, పెప్పర్ మింట్, మందార పువ్వులతో చేసిన హెర్బల్ టీలను సేవిస్తుండాలి. టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా ఈ పానీయాలను సేవించవచ్చు. ఇవి జీర్ణ క్రియను మెరుగు పరుస్తాయి. వీటిల్లో కెఫీన్ ఉండదు. ఒత్తిడిని తగ్గిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. సీజనల్ వ్యాధుల నుంచి రక్షణను అందిస్తాయి. టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా మచా టీని కూడా సేవించవచ్చు. ఇది ఆకుపచ్చ రంగులో ఉంటుంది. అంత ఆకర్షణీయంగా ఉండదు. కానీ ఈ టీని తాగితే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు. ఈ టీలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని శక్తి స్థాయిలను పెంచుతాయి.

**పసుపు టీ..:** టీ లేదా కాఫీలకు బదులుగా పసుపు టీని కూడా తాగవచ్చు. కాస్త పసుపును నీటిలో వేసి మరిగించి తాగాల్సి ఉంటుంది. పసుపులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తాయి. పసుపు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. గాయాలు, పుండ్లు త్వరగా మానేలా చేస్తుంది. దాల్చిన చెక్క, యాలకులు, అల్లం వేసి తయారు చేసిన కషాయాన్ని టీ లేదా కాఫీకి బదులుగా తాగవచ్చు. ఇది జీర్ణక్రియను పెంచుతుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది.

**కొబ్బరి నీళ్లు..:** కొబ్బరి నీళ్లను కూడా టీ, కాఫీలకు మంచి ప్రత్యామ్నాయం అని చెప్పవచ్చు. మీకు టీ లేదా కాఫీ తాగాలని అనిపిస్తే కొబ్బరి నీళ్లను ఒక గ్లాస్ తాగండి చాలు, ఎంతో మేలు జరుగుతుంది. ఈ నీళ్లలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కనుక బరువు పెరుగుతామన్న భయం ఉండదు. అలాగే కొబ్బరి నీళ్లను తాగితే శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. ఎండ వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరంలోని వేడి తగ్గి చల్లగా మారుతుంది. ఇక టీ, కాఫీలకు బదులుగా వెజిటబుల్ జ్యూస్‌ను కూడా తాగవచ్చు. కీరదోస, నిమ్మ, టమాటా, బీట్‌రూట్, క్యారెట్ వంటివి వేసి జ్యూస్ తయారు చేసి తాగితే మంచిది. ఈ జ్యూస్ వల్ల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి మన శరీరానికి కావల్సిన విటమిన్లు, మినరల్స్‌ను అందిస్తాయి. కనుక ఈ పానీయాలను మీరు టీ లేదా కాఫీకి బదులుగా సేవించవచ్చు. ఇవి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.



# చమురుపైనే చూపంతా..!



న్యూఢిల్లీ: వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అరెస్ట్ చేయడానికి కారణంగా డ్రగ్స్ బూచిని చూపిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసలు లక్ష్యం ఆ దేశంలోని భారీ చమురు నిక్షేపాలను కొల్లగొట్టడమేనని విశ్లేషకులు అంటున్నారు! అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. మదురో నియంత, కిరాతకుడు అనే మాట నిజమే కానీ, ప్రెసిడెంట్ ట్రంప్ చేసిన పని చట్టవిరుద్ధం, నిర్లక్ష్యపూరితం అని విమర్శించారు. యూఎస్ సెనేటర్ బెర్నీ శాండర్స్ ఇచ్చిన పోస్ట్‌లో, వేరొక దేశంపై దాడి చేసే అధికారం ట్రంప్‌నకు లేదని పేర్కొన్నారు. ఇప్పుడు తన నియంత్రణలో ప్రపంచంలోనే భారీ చమురు నిక్షేపాలు ఉన్నాయని, వీటి విలువ రూ. 1,557 లక్షల కోట్లు అని ట్రంప్ మీడియాకు తెలిపారు. అమెరికాకు చెందిన పెద్ద ఆయిల్ కంపెనీలు వెనెజువెలాకు వెళ్తాయని, బిలియన్ల డాలర్లు ఖర్చుపెట్టి, సొమ్ము సంపాదించుకుంటాయని చెప్పారు.

వెనెజువెలాలో ఎంత చమురు ఉంది?: అమెరికా ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, వెనెజువెలాలో 300 బిలియన్ బ్యారెళ్ల కన్నా ఎక్కువ చమురు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం చమురు నిల్వల్లో ఇది 20 శాతం. దీని విలువ రూ. 1,557 లక్షల కోట్లు అని అంచనా. ఈ చమురు హెవీగా ఉంటుంది, విద్యుదుత్పత్తి కేంద్రాలు, సిమెంట్ పరిశ్రమలు, నౌకలు, రోడ్డు నిర్మాణం, వాటర్‌ప్రూఫింగ్‌ల కోసం కూడా వాడతారు. అమెరికాకు 50 బిలియన్ బ్యారెళ్ల చమురు నిక్షేపాలు ఉన్నాయి. ఇది లైట్, స్వీట్ క్రూడ్. పెట్రోలు తయారీకి ఇది సరైనదే. ఇతర ఉత్పత్తుల తయారీకి అనువైనది కాదు. వెనెజువెలాలో రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల చమురు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రపంచం మొత్తం మీద రోజుకు ఉత్పత్తి అయ్యే చమురులో కేవలం 0.8 శాతం మాత్రమే వెనెజువెలాలో ఉత్పత్తి అవుతుంది.

చమురు ఉన్నా వెనెజువెలాకు ఈ దుస్థితి ఎందుకు?: ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలు ఉన్న వెనెజువెలా తలసరి ఆదాయం విషయంలో 2025లో ప్రపంచంలో 127వ స్థానంలో ఉంది. దేశ జనాభాలో 90 శాతం మంది పేదలే. 2018లో ద్రవ్యోల్బణం 1.7 మిలియన్ శాతానికి చేరుకుంది. ఫలితంగా 50,000; 1,00,000 డినామినేషన్ నోట్లను ప్రభుత్వం ముద్రించింది. కోడిగుడ్లు కొనడానికి ప్రజలు 1,00,000 విలువ గల నోట్లను 20 తీసుకోవలసి వచ్చేది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతి వల్ల దేశం ఈ దుస్థితిలో ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం చమురుపైన మాత్రమే ఆధారపడింది. 1970వ దశకంలో ఈ దేశంలో రోజుకు 3.5 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి జరిగేది. అంటే, ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న చమురులో సుమారు 7 శాతం అన్నమాట. క్రమంగా చమురు ఈ దేశ అతి పెద్ద బలహీనతగా మారింది. చమురు పరిశ్రమను 1976లో జాతీయీకరణ చేశారు. పీడీవీఎస్ఏ అనే ప్రభుత్వ కంపెనీని ఏర్పాటు చేశారు. 2002-03లో సమ్మె జరిగింది. ప్రభుత్వం 18,000 మంది వర్కర్లను తొలగించింది. చమురు నుంచి బిలియన్ల డాలర్లు సంపాదించినప్పటికీ, నిధులను పొదుపు చేయలేదు. 1980వ దశకంలో ధరలు పతనమవడంతో, మొత్తం వ్యవస్థ కుప్పకూలింది, ప్రజాగ్రహం వెల్లువెత్తింది. 1992లో ప్రజలు ప్రెసిడెంట్ హ్యూగో ఛావెజ్‌పై తిరుగుబాటు చేశారు. కానీ విఫలమయ్యారు. 2004-2008 మధ్య కాలంలో చమురు ధరలు బ్యారెల్‌కు 140 డాలర్లకు పెరిగాయి. భారీ లాభాలు రావడంతో, ప్రభుత్వం ఉచిత గృహ నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, చౌక ధరలకు ఆహారం పథకాలను ప్రవేశపెట్టింది. ల్యాప్‌టాప్‌లు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేసింది. ప్రభుత్వం బలవంతంగా ఆహార ధరలను తగ్గించింది. ప్రైవేట్ కంపెనీలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఫలితంగా ఉత్పత్తిని నిలిపేశాయి. ప్రభుత్వం చమురు ద్వారా వచ్చిన సొమ్ముతో అన్నిటినీ దిగుమతి చేసుకోవడం ప్రారంభించింది. దేశంలోని పరిశ్రమలు మూతపడ్డాయి, నిరుద్యోగం పెరిగిపోయింది. పీడీవీఎస్ఏని ఏర్పాటు చేసిన తర్వాత చాలా విదేశీ కంపెనీలు ఉత్పత్తిని నిలిపేశాయి. ప్రభుత్వం వాటి ప్లాంట్లను స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత విదేశీ పెట్టుబడులు చెప్పుకోదగ్గ స్థాయిలో రాలేదు. నైపుణ్యం గల ఇంజినీర్లు, నిపుణులు పీడీవీఎస్ఏని వదిలిపెట్టారు, వారి స్థానాల్లో రాజకీయ ప్రేరేపిత నియామకాలు జరిగాయి. కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టలేదు, మెషినరీని మెయింటెయిన్ చేయలేదు. ఫలితంగా చమురు వెలికితీత సామర్థ్యం తగ్గుతూ వచ్చింది. 50 ఏళ్ల నుంచి పైప్‌లైన్లను అప్‌డేట్ చేయలేదని, రిఫైనరీలు దయనీయస్థితిలో ఉన్నాయని పీడీవీఎస్ఏ సర్ది చెప్తున్నది. మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, ఉత్పత్తి పునఃప్రారంభం కోసం 58 బిలియన్ డాలర్ల మేరకు ఖర్చవుతుంది.

అమెరికా ఆంక్షలు..: గతంలో వెనెజువెలా చమురుకు అతి పెద్ద కొనుగోలుదారు అమెరికా. ఛావెజ్ విధానాలు, ప్రకటనల వల్ల ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత వెనెజువెలా చమురుకు అతి పెద్ద కొనుగోలుదారుగా చైనా మారింది. చమురుకు బదులుగా 10 బిలియన్ డాలర్ల రుణాలను చైనా ఇచ్చింది. 2018లో వెనెజువెలా ప్రభుత్వం అమెరికన్‌డాలర్లలో వ్యాపారాన్ని నిషేధించింది. ఒక డాలర్‌కు 10 బొలివర్స్ ఎక్స్ఛేంజ్ రేట్‌ను నిర్ణయించింది. కానీ మార్కెట్ రేటు ఒక డాలర్‌కు 1,000కిపైగా బొలివర్లు ఉంది. 2019 తర్వాత అమెరికా, ఇతర దేశాలు వెనెజువెలా ఆయిల్ కంపెనీపై ఆంక్షలు విధించాయి. దీంతో చమురు అమ్మకాలు, పెట్టుబడులను ఆకర్షించడం కష్టంగా మారింది. వీటన్నిటి వల్ల వెనెజువెలా దయనీయ స్థితికి చేరింది.

వెనెజువెలా నియంత్రణతో అమెరికాకు ప్రయోజనం ఏంటి?: వెనెజువెలాలో సుమారు 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడాయిల్ ఉంది.

# టార్గెట్ కమ్మ సామాజిక వర్గం!

గుంటూరు: ఏపీలో రాజకీయాలు అంటేనే సామాజిక సమీకరణలపై ఆధారపడి ఉంటాయి. ఇక్కడ సామాజిక వర్గాలు రాజకీయాలను శాసిస్తుంటాయి. ఫలానా కులం ఫలానా పార్టీ అని చాలా సులువుగా చెప్పవచ్చు. కమ్మ సామాజిక వర్గం అయితే తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే రెడ్డి సామాజిక వర్గం.. కాపులంటే జనసేన.. ఇలా రకరకాలుగా విశ్లేషించుకోవచ్చు. అయితే ఒక రాజకీయ పార్టీకి బలమైన మద్దతుదారులుగా సామాజిక వర్గాలు ఉంటాయి. ఇవి సహజం కూడా. అయితే కొన్ని సామాజిక వర్గాలు కొన్ని పార్టీలను విపరీతంగా ద్వేషిస్తుంటాయి. 2019లో రెడ్డి సామాజిక వర్గం టిడిపిని ద్వేషించింది. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కమ్మ సామాజిక వర్గం ద్వేషించింది. అయితే రాజకీయ పార్టీలకు సామాజిక వర్గాల మద్దతు మాట అటుంచితే.. శత్రువులుగా మారిపోవడం ఇటీవల పరిపాటిగా మారింది. అందుకే పార్టీలు ఇప్పుడు సామాజిక వర్గాల వ్యతిరేకి అనే ముద్ర పోగొట్టుకునేందుకు ఎక్కువ ప్రయత్నాలు చేస్తుంటాయి. ఇప్పుడు అదే ప్రయత్నంలో ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బలంగా పనిచేసింది కమ్మ సామాజిక వర్గం. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన కమ్మ సామాజిక వర్గం వ్యక్తులు ఏకతాటిపైకి వచ్చారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. దీనికి కారణం లేకపోలేదు. గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కమ్మ సామాజిక వర్గం ఒక రకమైన దాడి జరిగింది. వారి ఆర్థిక మూలాలపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సామాజిక వర్గానికి చెందిన వారి పరిశ్రమలను వెళ్ళగొట్టారు. వీటన్నింటికీ తోడు చంద్రబాబును జైలులో పెట్టి ఇబ్బంది పెట్టారన్న కసితో కమ్మ సామాజిక వర్గం ఒకే తాటి పైకి వచ్చింది. అయితే 2019లో రెడ్డి సామాజిక వర్గం చేసిన ఫైట్.. 2024 ఎన్నికల్లో కనిపించలేదు. అది జగన్మోహన్ రెడ్డికి మైనస్ గా మారింది. వాస్తవానికి ఏ సామాజిక వర్గాన్ని దూరం చేసుకోవాలని వ్యూహం ఉండదు ఏ రాజకీయ పార్టీకి. అందుకే జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లుగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు.

# హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన

## సోషల్ మీడియా ద్వారా యువత టార్గెట్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో మనుషుల అక్రమ రవాణా పై అవగాహన పెంచేందుకు ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కీలక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శైలజ నేతృత్వంలో రైల్వే పోలీసులతో కలిసి విజయవాడలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు, గుర్తింపు విధానాలపై కూడా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే డివిజనల్ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని, ముఖ్యంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాయపాటి శైలజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తమిళనాడుకు చెందిన పీఎం నాయక్ హాజరయ్యారని పేర్కొన్నారు. ట్రాఫికింగ్ అంటే.. ఒకే రకమైన నేరం కాదని, ఇది అనేక రూపాల్లో జరుగుతుందని రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. విద్యార్థులను విదేశాలకు పంపిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. పలు మార్గాల్లో ట్రాఫికింగ్ జరుగుతుంతోందని వెల్లడించారు. ముఖ్యంగా, బాధితులను గుర్తించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ట్రాఫికింగ్ మాఫియా తమ విధానాలను మార్చుకుంటున్నాయని, సోషల్ మీడియా ద్వారా కూడా యువతను టార్గెట్ చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా బీటెక్ చదువుతున్న విద్యార్థులను విదేశాలకు తీసుకెళ్లి, వారిని సైబర్ నేరాల్లో పాల్గొనేలా చేస్తున్నారన్నారు. ఇది సాధారణంగా కనిపించని కొత్త రకం ట్రాఫికింగ్ అని, దీనిపై ప్రత్యేక అవగాహన అవసరమని తెలిపారు. ట్రాఫికింగ్ బాధితులను గుర్తించడం మాత్రమే కాకుండా, వారిని సైకలాజికల్‌గా ఎలా డీల్ చేయాలో కూడా ఈ కార్యక్రమంలో వివరించామని రాయపాటి శైలజ పేర్కొన్నారు. బాధితులు మానసికంగా చాలా ఒత్తిడిలో ఉంటారని, అందుకే వారికి సహాయం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో రోబోటిక్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది భవిష్యత్తులో ట్రాఫికింగ్‌ను అరికట్టడంలో కీలక పాత్ర పోషించవచ్చని అభిప్రాయపడ్డారు.

# వలంటీర్ల వ్యవస్థ ముగింపేనా..!



విశాఖపట్టణం, : వాలంటీర్ వ్యవస్థ.. వైసీపీ హయాంలో పెన్షన్ల పంపిణీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు వైసీపీ ఏర్పాటు చేసిన ఔట్ సోర్సింగ్ వ్యవస్థ. ఈ వాలంటీర్ సిస్టమ్‌ను వైసీపీ దుర్వినియోగం చేసిందన్నదానిపైనే ఏపీ ఎన్నికల వేళ పెద్దఎత్తున చర్చ జరిగింది. వాలంటీర్ల సెంట్రిక్‌గానే ఎలక్షన్ ప్రచారం నడిచింది. ఈ నేపథ్యంలో కూటమి వాలంటీర్లపై అప్పట్లోనే సీరియస్ కామెంట్స్ చేసింది. ఇక పవర్‌లోకి వచ్చాక వాలంటీర్ల ముచ్చటే తీయకుండా సున్నితంగా ఆ సిస్టమ్‌కు చెక్ పెట్టగలిగింది. వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని అప్పట్లో సర్పంచ్‌లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరగా క్లియర్ కట్ క్లారిటీ ఇచ్చేశారాయన. అసలు వా ళ్లు ఉద్యోగంలో ఉంటే రద్దు చేయవచ్చని, కానీ అసలు వ్యవస్థలోనే లేరని చెప్పేశారు. దీంతో కూటమి సర్కార్ వాలంటీర్ వ్యవస్థకు మంగళం పాడినట్లేనని విమర్శించింది వైసీపీ. తాము లక్షల మంది వాలంటీర్లను పెట్టి ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేస్తే కూటమి సర్కార్ ప్రజలను ఇబ్బంది పెడుతోందని అటాక్ చేసింది. అయితే ఇప్పుడు వైసీపీ కూడా వాలంటీర్ వ్యవస్థపై యూటర్న్ తీసుకుంది. అప్పుడు జరిగిన డ్యామేజ్‌ను కవర్ చేసుకునేందుకు క్యాడర్ మనసు గెలుచుకునేందుకు సరికొత్త స్టేట్‌మెంట్స్‌తో ఇండికేషన్స్ పంపిస్తోంది. గత ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమికి వాలంటీర్ వ్యవస్థే కారణమని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ మధ్య కామెంట్స్ చేశారు. పాలనలో ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఎటువంటి ప్రాధాన్యం లేకపోవడంతో ప్రజలకు దూరమై, ఓడిపోయామన్నారు. వాలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలు జరిగి, వైసీపీకి నష్టం జరిగిందన్నారు గుడివాడ. ఈ సమస్యను అధినేత జగన్ కూడా గుర్తించారని, మరోసారి ఇటువంటి పొరపాటు జరక్కుండా చూసుకుంటారని చెప్పారు. 2029 ఎన్నికల తర్వాత మళ్లీ వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చే ప్రసక్తే ఉండదని, అధినేత జగన్ కూడా ఈ విషయమై స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని మాజీ మంత్రి తేల్చిచెప్పారు. ఏపీలో 2019 ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను పెట్టి వారి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు దగ్గరయ్యేలా చేసింది. దీంతో ప్రజలకు వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులకు మధ్య దూరం పెరిగిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. వాలంటీర్లకు ప్రాధాన్యం ఇవ్వడంపై వైసీపీ క్యాడర్ హర్ట్ అయిందని పార్టీకి, కార్యకర్తల మధ్య ఎమోషనల్ గ్యాప్ వచ్చిందన్న టాక్ ఉండేది. అందుకే 2019 ఎన్నికలకు ముందు కష్టపడి పనిచేసిన కార్యకర్తలు 2024కు వచ్చేసరికి డీలా పడిపోయారని అంటుంటారు. ఇప్పటివరకు ప్రచారంలో ఉన్న ఈ వాస్తవాలను ఇప్పుడు వైసీపీ కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. దీంతో వాలంటీర్ వ్యవస్థను తెచ్చి మళ్లీ పాత తప్పు చేయకూడదని వైసీపీ డిసైడ్ చేసుకున్నట్లు చెబుతున్నారు. గుడివాడ అమర్‌నాథ్ కామెంట్స్‌ను బట్టి చూస్తే..ఏపీలో వాలంటీర్ వ్యవస్థ పూర్తిగా ముగిసిన అధ్యాయమేనన్న క్లారిటీ వచ్చేసింది. తెరమరుగైన వాలంటీర్ల వ్యవస్థను తిరిగి కొనసాగించే అవసరం, అవకాశమే లేదని వైసీపీ నేతలు కూడా డిసైడ్ కావడంతో వాలంటీర్ వ్యవస్థ చరిత్రగానే మిగిలిపోనుంది. వైసీపీ ఇచ్చిన క్లారిటీతో కూటమికి పాజిటివ్‌గా మారే ఛాన్స్ ఉందంటున్నారు. మళ్లీ పవర్‌లోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను తెస్తామని వైసీపీ చెప్తే గనుక అదీ మళ్లీ ఎలక్షన్ ఎజెండాగా మారే అవకాశం ఉంటుంది. వాలంటీర్లు లక్ష మంది వరకు ఉంటారు. పైగా వాలంటీర్ వ్యవస్థ ఉన్నప్పుడు ప్రజలకు నేరుగా సేవలు అందాయన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ వాలంటీర్ వ్యవస్థను తీసుకొస్తామని వైసీపీ చెప్పినా..వాలంటీర్లకు ఎన్నికల ముందు కూటమి ఇచ్చినా హామీలను గుర్తు చేసినా..పొలిటికల్ ఫైట్‌కు దారితీసేది. కానీ వైసీపీనే వాలంటీర్ వ్యవస్థకు మంగళం అని చెప్పేదయం పొలిటికల్ ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది.

# మట్టి'మనుషులకు చట్టసభల్లో చోటేది?



తెలంగాణ జనాభాలో కుమ్మరి/శాలివాహన సామాజికవర్గం వాటా 1.2 శాతం ఉన్నందున దామాషా పద్ధతి ప్రకారం.. కనీసం 1 నుంచి 2 ఎమ్మెల్యే సీట్లు ఆ వర్గానికి దకాలి. 17 ఎంపీ సీట్లు ఉన్నందున ఐదు లోక్‌సభ ఎన్నికలకు ఒకసారి రొటేషన్ పద్ధతిలో ఒక స్థానం ఉండాలి. చట్టసభల్లో నేరుగా ఎన్నికయ్యే అవకాశం లేనప్పుడు నామినేటెడ్ కోటాలో శాసనమండలిలో కనీసం ఒక సీటు అయినా కేటాయించి వారి రాజకీయ శూన్యత్వాన్ని భర్తీ చేయాలి. కానీ, రాష్ట్రంలో 4,31,363 (1.2 శాతం) జనాభా ఉన్న కుమ్మరి సామాజికవర్గానికి చట్టసభల్లో ఒక సీటు కూడా దకకటం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల నుంచి ఇప్పటికీ కుమ్మరి సామాజికవర్గం ఒక నిశ్శబ్ద ఓటుబ్యాంకుగానే మిగిలిపోయింది. ఉమ్మడి ఏపీలో 294 అసెంబ్లీ స్థానాలు ఉన్నప్పటికీ, కుమ్మరి కులస్తులకు ఎమ్మెల్యే టికెట్లు దక్కలేదు. జనాభాపరంగా బీసీ-బీ క్యాటగిరీలో ఉన్న వీరు, రాజకీయంగా బలంగా ఉన్న ఇతర బీసీ కులాల నీడలోనే ఉండిపోయారు. కాంగ్రెస్ లేదా టీడీపీ వంటి ప్రధాన పార్టీలు వీరిని కేవలం స్థానిక సంస్థల స్థాయికే పరిమితం చేశాయి. నామినేటెడ్ పదవుల్లో కూడా వీరికి దకిన వాటా నామమాత్రమే. కుమ్మరి సామాజికవర్గానికి చెందిన బలమైన నేత ఐలాపురం వెంకయ్య శాసనమండలి సభ్యునిగా ఎనిమిదేండ్లపాటు పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా తాడూరి శ్రీనివాస్‌కు కేసీఆర్ అవకాశం కల్పించారు. కుమ్మరి కులానికి ఆత్మగౌరవ భవనం కేటాయించారు. రాష్ట్రమంతటా కుమ్మరి జనాభా విస్తరించి ఉన్నది. కానీ, ఏ ఒక నియోజకవర్గంలోనూ గెలుపోటములను శాసించే స్థాయిలో లేదు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 94 మంది కుమ్మరి కులస్తులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా గెలిచి సత్తాచాటారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన సీపెక్ డాటా గణాంకాలను పరిశీలిస్తే, సామాజికంగా, ఆర్థికంగా కుమ్మరులు నిలకడగా ఉన్నప్పటికీ రాజకీయంగా ఈ కులం తీవ్ర వివక్షకు గురవుతున్నట్టు కనిపిస్తున్నది. రాష్ట్రం మొత్తం జనాభాలో కుమ్మరుల వాటా 1.2 శాతం. వీరి ఆర్థిక స్థితిగతులు మెరుగ్గానే ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం భూమిలో 1.4 శాతం భూమి వీరి హస్తగతమై ఉన్నది. జనాభా నిష్పత్తి కంటే ఎకువ భూమిని కలిగి ఉండి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తమదైన ముద్ర వేస్తున్నప్పటికీ, రాజకీయంగా మాత్రం వీరి గొంతు చట్టసభలకు చేరడం లేదు. కేవలం ఓటుబ్యాంకుగానే కాకుండా, చట్టసభల్లో నిర్ణయాత్మక శక్తులుగా కుమ్మరులను గుర్తించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

# వైసీపీ కిం కర్తవ్యం



విజయవాడ, : ప్రస్తుతం దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ మీద రాజకీయ చర్చ సాగుతోంది. అధికార ఎన్డీయే తీసుకున్న విధానం పట్ల ఇండియా కూటమిలో తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలు అయితే తమ సీట్లు పెద్ద ఎత్తున తగ్గి రాజకీయంగా అభివృద్ధి పరంగా ఇబ్బంది అవుతుందని కూడా ఆందోళన చెందుతున్నాయి. దక్షిణాదిలోనే ఎక్కువగా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. అయితే ఇందులో ఇండియా కూటమిలో ఉన్న డీఎంకే లాంటివి పూర్తిగా యాంటీ స్టాండ్ తీసుకుంటే అన్నా డీఎంకే జేడీఎస్, టీడీపీ జనసేన వంటివి జై కొడుతున్నాయి. అయితే చిత్రంగా తటస్థంగా ఉన్న వైసీపీ మాత్రం డీలిమిటేషన్ మీద కేంద్రం అనుసరిస్తున్న విధానానికి అనుకూలంగా స్పందిస్తోంది. అదే సమయంలో తెలంగాణాలో ఉన్న మరో ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ అయితే బిల్లు స్వరూప స్వభావాలను చూసి మాత్రమే ఏ సంగతీ చెబుతామని అంటోంది: దేశంలో కొత్తగా సీట్లు పెరిగితే మంచిదే కదా ఎంత మంది యువతకు కొత్త వారికి అవకాశాలు వస్తాయని వైసీపీ అంటోంది. అంతే కాదు చిన్న నియోజకవర్గాల వల్ల అభివృద్ధి కూడా సాగుతుందని చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం అసెంబ్లీ పార్లమెంట్ సీట్ల పునర్ విభజన చేసే విధానం పట్ల సంతృప్తిగా ఉన్నామని ఆ పార్టీ నేత సజ్జల రామక్రిష్ణారెడ్డి ప్రకటించడం విశేషం. నిజం చెప్పాలీ అంటే ప్రాంతీయ పార్టీల పట్టుని దెబ్బ తీసే విధంగా డీలిమిటేషన్ ప్రక్రియ ఉండబోతోంది అని అంతా అంటున్న నేపథ్యం ఉంది. స్టాలిన్ విజయ్ వంటి ప్రాంతీయ పార్టీల నేతలు వ్యతిరేకిస్తూ వైసీపీ ఓకే చెప్పడమే అసలైన ట్విస్ట్ ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అయితే డీలిమిటేషన్ మీద ఆచీ తూచీ స్పందించారు. కేంద్రం ప్రవేశపెడుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము మద్దతు ఇస్తున్నట్లుగా ప్రకటించిన బీఆర్ఎస్ డీలిమిటేషన్ విషయంలో మాత్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించడం విశేషం. డీలిమిటేషన్ బిల్లులో పేర్కొన్న అంశాలు అన్నీ చూసిన మీదటనే పార్టీ ఒక నిర్ణయం తీసుకుంటుందని కేసేఆర్ చెప్పడం విశేషం. సహేతుకంగా డిమాండ్‌ఇదిలా ఉంటే ప్రస్తుతం 543 ఎంపీలు దేశంలో ఉంటే సౌత్ స్టేట్స్ నుంచి 24 శాతం మంది ఎంపీల ప్రాతినిధ్యం ఉంది. ఆ శాతం తగ్గకుండా 50 శాతం సీట్లు పెంచాలని బీఆర్ఎస్ కోరుతోంది. అది కూడా 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని బీఆర్ ఎస్ అంటోంది. మొత్తం మీద డీలిమిటేషన్ విషయంలో బీఆర్ ఎస్ నిర్మాణాత్మకంగానే వ్యవహరించాలని చూస్తోంది. అలాగే ప్రాంతీయ పరమైన అవసరాలను పరిగణనలోకి తీసుకుంటోంది. వైసీపీ మాత్రం ఎన్డీయేకు ఔట్ రేట్ గా మద్దతు ఇవ్వడమే చర్చనీయాంశంగా ఉంది.

## కరువు భత్యం ఉద్యోగుల హక్కు

భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు పొందే కరువు భత్యం (డి.ఎ) ప్రభుత్వం దయతో ఇచ్చే సాయం కాదు. అది వారి శ్రమకు, సేవలకు,అలాగే జీవన వ్యయాల పెరుగుదలకు అనుగుణంగా కల్పిం చాల్సిన చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన హక్కు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. వైద్య ఖర్చులు భరించలేనం తగా పెరిగాయి. గృహ,విద్య,రవాణా వ్యయాలు తీవ్రమయ్యాయి. అయితే, ఈ పెరిగిన భారానికి తగిన పరిహారమైన డి.ఎ మాత్రం ఇవ్వలేదు. ఇది సామాజిక న్యాయం, సంక్షేమ పాలన స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం.

ఇటీవల గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ విషయంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. "కరువు భత్యం ఉద్యోగుల హక్కు. దాన్ని నిరాకరించడం లేదా నిరవధికంగా వాయిదా వేయడం సమంజసం కాదు." అని కోర్టు స్పష్టంగా పేర్కొన్నది. ఈ వ్యాఖ్యా నంతో, డి.ఎ ను ఒక దానంగా కాకుండా చట్టబద్ధమైన హక్కుగా పరిగణించాల్సిందేనని న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వాలు ఆర్థిక ఇబ్బందులను చూపుతూ ఉద్యోగుల హక్కులను కాలరాయలేవని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

ఉద్యోగులతో పోలిస్తే పెన్షనర్ల పరిస్థితి ఇంకా క్లిష్టమైనది. వారికి ఇతర ఆదాయ వనరులు ఉండవు. వయస్సు కారణంగా వైద్య అవసరాలు అధికంగా ఉంటాయి. కుటుంబ సభ్యులపై ఆధారపడే పరిస్థితులు పెరుగుతాయి. అటువంటి స్థితిలో డి.ఎ/డి.ఆర్ (డియర్ నెస్ రిలీఫ్) నిలిపివేయడం అంటే వారిని ఆర్థికంగా అశక్తులను చేయడమే. పెన్షన్ అనేది దానం కాదు–అది ఉద్యోగ కాలంలో చేసిన సేవలకు ప్రతిఫలం. అందులో భాగమైన డి.ఆర్ ను నిలిపివే యడం మానవ హక్కుల ఉల్లంఘనకు సమానం.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ప్రకారం,ప్రతి పౌరుడికి గౌర వప్రదమైన జీవితం గడిపే హక్కు ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కూడా పౌరులే. అందువల్ల ప్రభుత్వాల బాధ్యత ఏమిటం టే డి.ఎ బకాయిలను పూర్తిగా, వెంటనే చెల్లించాలి. ఆలస్యానికి తగిన వడ్డీతో సహా పరిహారం ఇవ్వాలి. భవిష్యత్తులో డి.ఎ ఫ్రీజ్ వంటి నిర్ణయాలు తీసుకోకుండా చట్టపరమైన హామీ ఇవ్వాలి.

అభివృద్ధి పేరుతో, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వా లు, ఆ అభివృద్ధిని మోసుకొచ్చిన ఉద్యోగుల హక్కులను విస్మరించ డం ఘోర అన్యాయం. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ఉద్యోగ సంఘాలు,పెన్షనర్ల సంఘాలు సంవత్సరాలుగా నిరంతర ఉద్యమా లు చేస్తున్నాయి. వారి డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. డి.ఎ బకాయి లను వెంటనే చెల్లించాలి. పి.ఆర్.సి ల అమలులో డి.ఎ ను సము చితంగా విలీనం చేయాలి. పెన్షనర్లకు సమాన న్యాయం కల్పిం చాలి. ప్రభుత్వాలు ఇకనైనా న్యాయస్థానాల తీర్పులను గౌరవించాలి. ఉద్యోగులు, పెన్షనర్ల విశ్వాసాన్ని నిలబెట్టాలి.

## పేదవాడి మెతుకు కార్డుపై అధికారుల నిర్లక్ష్యం..!

ఇటిక్యాల : కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వందలాదిమంది నిరుపేదల ఆశలు అడియాశలవుతున్నాయి. గత పది ఏళ్ల తరబడి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు దేవుడు కరుణించిన కానీ అధికారులు కనికరించరన్న అపవాదిని రెవెన్యూ అధికారులు మూటగట్టుకుంటున్నారు. రేషన్ కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు నెలలు తరబడి రేషన్ కార్డుల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి కార్యాలయాల్లో ఫైళ్లు కదలాలంటే ‹చేతులు తడవాల్సిందే› అన్న విమర్శలు కార్యాలయ వెలుపల్లో వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరు దారుణంగా ఉంది. అర్హులైన నిరుపేదలు మీ–సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా, అవి నేటికీ ఎమ్మార్వో లాగిన్‌లలోనే మూలుగుతున్నాయి. విచారణ పేరుతో కాలయాపన చేయడం, సాంకేతిక కారణాలు చెప్పి దరఖాస్తులను తిరస్కరించడం అధికారులకు పరిపాటిగా మారింది. జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎమ్మార్వో కార్యాలయంలో సిబ్బంది అవినీతి అవతారమెత్తిన ‹అప్రూవల్› కొందరు అధికారులు, సిబ్బంది పేదవాడి ఆకలిని పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. అర్హత ఉన్నా సరే, రేషన్ కార్డు ఆమోదం పొందాలంటే మధ్యవర్తుల ద్వారా వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ::డబ్బులు ఇస్తేనే పని జరుగుతుందని లేదంటే ఫైల్ పెండింగ్‌లో ఉంటుందనే ధోరణి ఎమ్మార్వో ఆఫీసుల్లో బహిరంగ రహస్యంగా మారింది.

## సోషల్ మీడియాతో పిల్లల్లో ఏకాగ్రత లోపం!

### తాజా అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, : సోషల్ మీడియాపై గంటల తరబడి గడిపే పిల్లల్లో మానసిక ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు దెబ్బతింటున్నాయని, ఏకాగ్రత లోపిస్తున్నదని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. అమెరికా వ్యాప్తంగా పిల్లలపై జరిగిన ఓ అధ్యయనం ప్రకారం, స్మార్ట్‌ఫోన్‌పై తరుచూ స్క్రోలింగ్, నోటిఫికేషన్‌లను చూస్తూ గడపటం.. పిల్లల్లో 'ఏడీహెచ్‌డీ' వంటి లక్షణాల్ని (చంచల స్వభావం, పనిపై శ్రద్ధ లేకుండుట) పెంచుతున్నదని పరిశోధకులు గుర్తించారు. అమెరికాలో సగటున ప్రతి పిల్లాడు టీవీ, ఆన్‌లైన్ వీడియోలపై రోజూ సగటున 2.3 గంటలు, సోషల్ మీడియా కోసం 1.4 గంటలు, వీడియో గేమ్స్‌పై 1.5 గంటలు గడుపుతున్నాడట. అయితే ఇందులో సోషల్ మీడియా ఒక్కటే పిల్లల ఏకాగ్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. అన్ని రకాల 'స్క్రీన్ టైమ్' పిల్లలపై ఒకేవిధమైన ప్రభావం చూపటం లేదన్న విషయం వీరి పరిశోధనలో తేలింది. స్వీడన్‌కు చెందిన కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, యూఎస్‌కు చెందిన ఒరేగాన్ హెల్త్, సైన్స్ వర్సిటీ పరిశోధకులు సం యుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

# 22 శాతం మందికే లక్ష పైన ఆదాయం

## ప్రైవేటులో అగ్రవర్ణాల చదువులు.. ప్రభుత్వ బడుల్లో ఎస్సీ ఎస్టీలు



హైదరాబాద్: తెలంగాణలో కులగణన రిపోర్టులో కీలక విషయాలు వెల్లడ య్యాయి. రాష్ట్రంలోని 78 శాతం కుటుంబాలకు ఆదాయం ఏడాదికి రూ.లక్ష కంటే తక్కువగానే ఉందని తెలిపింది. అదే సమయంలో తెలంగాణ లోని ఎస్సీ,ఎస్టీ వర్గాలు.. అగ్రవర్ణాల కంటే3 రెట్లు వెనుకబడి ఉన్నాయని తేలింది. అదే సమయంలో మొత్తం 242 కులాలు ఉండగా.. అందులో 135 కులాలను అత్యంత వెనుకబ డినవిగా గుర్తించారు.తెలం గాణలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదికలో రాష్ట్రంలో కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం బయటికి వచ్చింది. ఈ క్రమం లోనే రాష్ట్రంలో మొత్తం 3.55 కోట్ల మంది ప్రజలు ఉన్నారని వెల్లడించింది. అంతేకాకుండా కులాలకు సంబంధించి కూడా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో విద్య, ఆర్థిక రంగాల్లో చాలా కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని ఈ రిపోర్టు తెలిపింది. తెలంగాణలోని మొత్తం 242 కులాల్లో 135 కులాలు అత్యంత వెనుక బడినవిగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర జనాభాలోని 67 శాతం మంది ప్రజలు ఈ 135 కులాలకు చెందిన వారేనని వెల్లడైంది. ఇక రాష్ట్ర సగటు కంటే ఈ కులాలు ఎక్కువగా వెనుకబడి ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది.మరీ ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం.. ఎస్సీల్లో 97 శాతం..బీసీల్లో 71శాతం మంది ప్రజలు..తెలంగాణ రాష్ట్ర సగటు కంటే చాలా వెనుక బడి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇక అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ చెబుతున్నాయి.

ఇక రాష్ట్రంలోని 78.2 శాతం కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.లక్ష కంటే తక్కు వగానే ఉన్నట్లు ఈ నివేదిక విస్తుపోయే నిజాలను బహి ర్గతపరిచింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎస్టీల్లో 88.2 శాతం.. ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గిపోతున్నాయని వెల్లడైంది.అదే సమయంలో రాష్ట్రంలోని అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు ఎక్కువగా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఇక బీసీలు కూడా అగ్రవర్ణాల కంటే 2.7 రెట్లు వెనుకబడి ఉన్నారని పేర్కొంది. ఇక అగ్రవర్ణాల్లో కూడా దాదాపు సగం మంది అంటే 43.8 శాతం కుటుంబాలు మాత్రమే లక్ష కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నాయని తేలింది. ఏడాదికి రూ.5 లక్షల కంటే అధిక ఆదాయం ఉన్నవారిలో అగ్రస్థానంలో 13.2 శాతంతో అగ్రవర్ణాలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. ఆదాయపు పన్ను కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణా లకు చెందిన వారేకావడం గమనార్హం..సామాజిక వర్గాల మధ్య వ్యత్యాసాలు విద్యారంగంలో కూడా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. అగ్రవర్ణాలకు చెందిన వారిలో 34 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. అదే సమయంలో ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మంది మాత్రమే ప్రైవేటు బడుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. డిప్లొమా అంతకంటే ఎక్కువ ఉన్నత విద్య 31 శాతంతో ఎస్టీలు వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. ఇక ఇంగ్లీష్ మీడియం చదువుల్లోనూ 66 శాతంతో అగ్రవర్ణాలు ముందంజలో ఉ ండగా.. ఎస్టీలు 36 శాతానికే పరిమితమయ్యారు.

# భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ఔన్నత్యం!

అన్ని మతాలను, సంస్కృతులను గౌరవించటం మన వారసత్వం. కానీ, ఇటీవల కొంతమంది మతోన్మాదంతో ఈ సంస్కతికి భంగం కలిగిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మతం పేరిట ఉన్మాదాన్ని రెచ్చగొట్టటం, వివాదాలు సృష్టించటం తరచూ చూస్తున్నాం. ఉత్తరాఖండ్‌లో ఒక మతోన్మాద మూక ఇలాంటి వివాదాన్నే రగిలించబోతే– ధైర్యంగా ఎదుర్కొన్నాడు దీపక్ కుమార్. 'మనుషుల మధ్య పెరగాల్సింది ప్రేమ. విద్వేషం కానేకాదు." అని గట్టిగా చెప్పి, మానవత్వానికి, మనిషితనానికీ ప్రతీకగా నిలిచాడు. మతాల పేరుతో మనుషుల మధ్య చిచ్చుపెట్టాలని ఉన్మాదులు ప్రయత్నించిన ప్రతిసారీ ఇక్కడ 'మతం కంటే మానవత్వం గొప్పది' అని నిరూపితమవుతూనే ఉంది. తాజాగా ఉత్తరాఖం డ్‌లో జరిగిన ఉదంతం మరోసారి దాన్ని రుజువు చేస్తోంది. అయితే ఈ సారి మరింత ప్రభావ వంతంగా కనిపిస్తోంది. నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధ ముస్లింకి అండగా నిలబడిన హిందూ యువకుడిని, దాడి చేస్తున్న మూక 'నువ్వెవరు?' అని ప్రశ్నించింది. అప్పుడు ఆ యువకుడు.. 'నేను.. మహ్మద్ దీపక్‌ని. నేను హిందువుని. అంతకంటే ముందు నేను భారతీయుడిని' అని తీక్షణమైన చూపులతో సమాధానం చెప్పాడు. ఆ మాటలు మాట్లాడుతున్న దీపక్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'రాజ్యాంగ బద్ధంగా ఈ దేశాన్ని పాలించుకుంటాం' అని ప్రమాణం చేసుకుని 75 ఏళ్ల గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న రోజున, ఆ స్ఫూర్తికి విరుద్ధంగా ఈ ఘటన జరిగింది. ఉత్తరాఖండ్ కొత్ద్వార్ పటేల్ వీధిలో 70 ఏళ్ల ముస్లిం వ్యక్తి 'బాబా స్కూల్ డ్రెస్ అండ్ మ్యాచింగ్ సెంటర్' పేరుతో ఓ దుకాణం నడుపుతున్నారు. మూడు దశాబ్దాలుగా ఆ పేరుతోనే నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆయన పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన కుమారుడు షోయబ్ షాపు బాధ్యతలు తీసుకున్నారు. మొన్న జనవరి 26న కొంతమంది భజరంగ్ దళ్ వ్యక్తులు వచ్చి షాపులో ఉన్న షోయబ్‌ని, ఆయన తండ్రిని తీవ్ర దుర్భాషలాడారు. 'బాబా' పేరు హిందువుల పేరని, ఆ పేరుతో షాపు నిర్వహించకూడదని హుకుం జారీచేశారు. హిందూ పేరు పెట్టుకుని ఓ ముస్లిం షాపు నడపడం ఏంటని కళ్లెర్రజేశారు. ఈ హఠాత్ పరిణామా నికి ఆ వృద్ధుడు నిలువెల్లా కంపించిపోయాడు. షోయబ్ ఆ వ్యక్తులకి సర్దిచెప్పేందుకు నానా తిప్పలు పడుతున్నాడు. ఇది కొత్తగా పెట్టుకున్నది కాదని, 30ఏళ్ల నుండి దీన్ని ఇలాగే నడుపు కుంటున్నామని బతిమాలాడాడు. అయినా ఆ మూక వినిపించుకోలే దు. గట్టి గట్టిగా అరుస్తూ వాళ్లని భయభ్రాంతులకు గురిచేశారు. అప్పుడు అక్కడే, పక్క షాపులో ఉన్న దీపక్ ఈ మొత్తం వ్యవహారాన్ని చూశాడు. వెంటనే ఆ మూకని ఎదుర్కొనేందుకు, ఆ ముస్లిం సోదరు లకి సాయంగా ఉ ండేందుకు ముందుకు వచ్చాడు. దీపక్ మామూ లుగా రాలేదు. 'ఏంటి భారు ఈ గలాటా! 'బాబా' పేరు పెట్టుకుంటే మీకేంటి? ముందు ఇక్కడి నుండి వెళ్లిపోండి?' అని తీవ్రస్వరంతో చెప్పాడు. వెంటనే మూకలోని ఓ వ్యక్తి 'నువ్వెవరు? అసలు వీళ్లకి నువ్వు ఏమవుతావు?' అని ప్రశ్నించాడు. 'నేను మహ్మద్ దీపక్!. నేను హిందువుని. నా మతం అంటే నాకు ఎనలేని గౌరవం. అయితే అంతకంటే ముందు నేను భారతీయుడిని' అని దీపక్ సమాధానం చెప్పాడు. ఇదంతా జరుగుతున్నప్పుడే మరికొంతమంది హిందూ యువకులు వచ్చి దీపక్‌కి సాయంగా నిలబడ్డారు. మూకని వెళ్లగొట్టారు. గొడవ ఇంతటితో ఆగిపోలేదు. మూకతో దీపక్ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మత సామరస్యానికి చిహ్నంగా నిలిచిన అతని ధైర్యసాహసాలకి దేశ నలుమూలల నుండి ప్రశంసలు వెల్లువెత్తాయి. అది సహించలేని కుహనా దేశభక్తులు ఈసారి దీపక్‌పై తమ ద్వేషాన్ని వెళ్లగక్కారు. జనవరి 31న జిమ్ నిర్వాహకుడైన దీపక్‌కి వ్యతిరేక నినాదాలు చేస్తూ వందల సంఖ్యలో భజరంగ్ దళ్ సభ్యులు కొత్ద్వార్ చేరుకున్నారు. దీపక్ 'జిమ్'ని దిగ్బంధం చేశారు. 'ముస్లిం వ్యతిరేక నినాదాలు చేస్తూ.. నువ్వు కూడా వాళ్లల్లో చేరిపో' అని దుర్భాషలాడారు. అయినా వాళ్ల అక్కసు చావలేదు. వృద్ధుడైన 60 ఏళ్ల తమ కార్యకర్తపై దీపక్ దాడి చేశాడని నిందలు వేసి, పోలీసు స్టేషనులో కేసు పెట్టారు. ఇక్కడ విచారించాల్సిన విషయం మరొకటి జరిగింది. ఆ రోజు జరిగిన దాడిలో ఇరుపల నుండి వచ్చిన ఫిర్యాదులని తీసుకున్న పోలీసులుమూక సభ్యులని వదిలిపెట్టి, దీపక్‌ని పోలీస్ స్టేషనుకి తీసుకెళ్లారు. పగలంతా అక్కడే వుంచి రాత్రికి ఇంటికి పంపారు. దీపక్‌పై వాళ్లు పెట్టిన కేసు ఇంకా ఉంది. దీపక్‌ని, కుటుంబసభ్యులని బెదిరిస్తూ అప్పటి నుండి ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. జిమ్ కూడా మూతబడింది. ఇదంతా దీపక్‌కి వచ్చిన అనుకోని కష్టం. దీనిపై దీపక్ మాట్లాడుతూ, 'వాళ్లు ఎన్ని బెదిరించినా నేను భయపడను. ఆ రోజు నేను ఏదైతే చెప్పానో (మహ్మద్ దీపక్) దానికే కట్టుబడి ఉంటాను.ఈదేశంలో అన్నిమతాలు సమానం. ఇక్కడ ఎవరూ హిందువు లు, ముస్లింలు, సిక్కులు, జైనులు కాదు. అందరూ భారతీయులు. మతం కంటే ఇక్కడ మానవత్వం కనిపిస్తుంది. అందుకే ఆ రోజు నేను వాళ్లకి అండగా నిలబడ్డాను. నాలాగే ఈ దేశంలో ఎంతోమంది ఉన్నారు. వారే అసలైన భారతీయులు. నా సహోదరులు' అని దీపక్ ఎంతో గంభీరంగా చెప్పాడు. 'భారతీయత' అన్న పదానికి అసలైన అర్థం ఇదే కదా!: ఈ ఘటన తరువాత వస్త్ర దుకాణాల కమిటీ వ్యక్తులు కూడా దీనిపై స్పందించారు. 'మతం పేరుతో మా మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే మేం ఊరుకోం. ఎప్పటి నుండో మేమంతా కలిసిమెలిసి ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నాం. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదు. ఇప్పుడు మీరు వచ్చి గలాటా చేస్తుంటే చూస్తూ కూర్చోం' అంటూ ఖరాఖండిగా మధ్య వయస్కుడైన ఓ హిందూ వ్యక్తి మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడో ఓ చోట ఈ తరహా ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. విద్వేషం రెచ్చగొట్టాలని చూసిన ప్రతిసారీ హిందూ, ముస్లిం ఐక్యతని చాటే వ్యక్తులు కనప డుతూనే ఉన్నారు. మొన్నీమధ్య తమకి వ్యతిరేకంగా వార్తలు రా స్తున్నాడని, అధికారుల సాయంతో కాశ్మీరీ ముస్లిం జర్నలిస్టు ఇంటిని కూల్చేస్తే, వాళ్లకి తన ఇంటి పత్రాలు ఇచ్చి దాతృత్వం చాటుకున్న వ్యక్తి ఓహిందువు. 'ముస్లిం దర్జీల దగ్గరికి హిందూ మహిళలు వెళ్లొ ద్దని, కొలతల పేరుతో వారు అసభ్యంగా ప్రవర్తిస్తార'ని 24 ఏళ్ల కిందట ఆంక్షలు పెట్టినప్పుడు ప్రముఖ పర్యావరణ వేత్త, పద్మ భూషణ్ గ్రహీత డాక్టర్ అనిల్ పి.జోషి భార్య సంధ్య జోషి, ఆమె సోదరి గీతా ఆ ఆరోపణలని తీవ్రంగా ఖండించారు.

# రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే చరిత్ర క్షమించదు




రాష్ట్రంలో మన భారత రాజ్యాంగ పీఠిక అభాసు పాలవుతున్నది. పౌరుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వేదన కలిగిస్తున్నది. బాధ్యతాయుత ప్రభుత్వం చేయాల్సిన పని ఇలా కానే కాదు. రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలన కాళరాత్రులను ప్రజల జీవితాల్లోకి ప్రవహింప చేస్తున్నది. చట్టం ముందు అందర్నీ సమానంగా చూస్తామని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పిస్తామని ప్రమాణం చేసిన నాయకులు వాటిని గాలికొదిలేస్తున్నరు. ఎవ్వరూ చెప్పినా.. ఎంత చెప్పినా.. ప్రజల గగ్గోలు పెడుతున్నా... గోడు గోడమని గోస పడుతున్నా కనీసం కనికరించడం లేదు. ఎప్పుడు ఎవరి ఇండ్లు కూల్చేస్తారో తెలియదు. ఎప్పుడు ఎక్కడ హైడ్రాపేరుతో బుల్డోజర్లు వస్తాయో తెలియని భయానక వాతావరణం నేడు రాష్ట్రంలో కన్పిస్తూ ఉన్నది. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రజల ముందు ఉంచింది. ఏడో గ్యారెంటీగా భావప్రకటనా స్వేచ్ఛను కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ప్రజల ఆస్తులు కూలుస్తామని ఎనిమిదో గ్యారెంటీని చెప్పకుండా దాచుకున్నది. ఇప్పుడు తమ రహస్య ఎజెండాను అమలు చేస్తున్నదనే అనుమానం ప్రజల్లో కలిగేలా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ వ్యవహార శైలి గురించి మరింత నిర్దుష్టంగా చెప్పాలంటే భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హామీ అయిన ఆర్టికల్ 19, 21తో పాటు చట్టబద్ధమైన ఆస్తి హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నది. తమ జీవన భద్రతకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. 1973లో సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. అదే కేశవానంద భారతీ కేసుగా చరిత్రకెక్కింది. పౌరుల హక్కుల కంటే పార్లమెంట్, అసెంబ్లీ చేసిన చట్టాలు మహోన్నతమైనవి ఏమీ కాదని చెప్పింది. హైడ్రాపై అసెంబ్లీ ఆమోదముద్ర వేయించుకున్నంత మాత్రాన ప్రజల ఆస్తులను, వారి గౌరవ ప్రదమైన జీవితాలను ధ్వంసం చేసేహక్కు చట్టసభలకు ఉ ంటుందా? ప్రజల జీవితాలకు రక్షణ లేకుండా చేయాలని చట్టాలు చెప్తున్నాయా.? ప్రభుత్వం వహరిస్తున్న తీరు ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధం కాదా? 1960–80 మధ్య కాలంలో భారత రాజ్యాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న సందర్భం. ఎస్ఆర్ బొమ్మై కేసు, కేశవానంద భారతి కేసుతోపాటు చాలా కేసుల్లో న్యాయస్థానాలు చొరవ తీసుకోవ డం వల్ల భారత ప్రజాస్వామ్య సజీవతకు బీజం పడింది. అంతేకాదు పౌరులు గౌరవప్రదంగా, నిర్భయంగా జీవించే ధైర్యాన్ని కూడా న్యాయ స్థానాలు కల్పించాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహ రిస్తున్న తీరుపై కోర్టులు మొట్టికాయలు వేసినా తన తీరు మార్చుకో వడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రాగానే కూల్చివేతలు మొదలు పెట్టింది. ఇది ఇటీవల పరాకాష్టకు చేరింది. ఖమ్మం జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న వెలుగుమట్లలో పేదలకు చెందిన వందలా ది నివాసాలను ధ్వంసం చేసింది. ప్రజల పట్ల ప్రేమ లేకపోవడమే ఇందుకు కారణమా? లేకపోతే చట్టాల పట్ల గౌరవం లేకపోడమే కారణమా? తమను ఎవ్వరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నారా? కాంగ్రెస్ పార్టీ తమది ప్రజాస్వామ్యయుత నేపథ్యం అని చెప్పకుంటుంది. కానీ చర్యలు మాత్రం దానికి భిన్నంగా ఉంటాయి. భవిష్యత్తు అభివృద్ధి కోసమని గడిచిన ఏడు దశాబ్దాలుగా ఇక్కడి పేదలకు జీవనాధారమైన భూములు కోల్పోయారు. ఎక్కడెక్కడి వారో ఇక్కడికి వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక్కడి వారు మాత్రం మౌలిక సదుపాయాల కోసమని, నైట్‌మార్కెట్ కోసమని నివాసాలను, భూములను కోల్పోతున్నారు. మన రాజ్యాంగం ఇచ్చిన హామీ ప్రకారం ఎవరైనా ఎక్కడైనా జీవించొచ్చు, వ్యా పారాలు చేసుకోవచ్చు. నివాసాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ ఇతరుల కోసం తరాలకు తరాలు ఆస్తులు కోల్పోవడాన్ని రాజ్యాంగం సమర్థిస్తుందా? ఇక్కడి పేదలను నిలువునా ముంచుతామని అంటే నిర్దేశిత చట్ట నియామాలు మౌనంగా ఉంటాయా? ఎలాంటి అభివృద్ధి అయినా సరే విధ్వంసం, విస్తాపనకు ప్రత్యామ్నాయాలు లేనే లేవా? ఈ తీరులో పాలకులు ఎందుకు ఆలోచించడం లేదు? మూసీ సుందీకరణ కోసం సుమారు యాభై కిలోమీటర్ల మేర లక్షలాది నివాసాలను ధ్వంసం చేస్తామని అంటే ఎట్లా ఊరుకోవాలి? చిన్నచిన్న పనులు చేసుకొని పొట్ట పోసుకుంటున్న బడుగు జీవుల గూళ్లను చెదరగొడ్తామంటే ఎట్లా? మధ్యతరగతి వారి జీవితపు కలం సొంత ఇల్లు. బ్యాంకు లోన్లు తీసుకొని ఏండ్లకు ఏండ్లు కిస్తీలు కట్టుకుంటున్న వారి ఆశలను అడియాశలు చేస్తామంటే ఎట్లా? ప్రైవేటు రంగంలో జీవన భద్రతకు గ్యారెంటీ లేదు. అప్పుల మధ్యనే జీవితం సాగుతూ ఉంటుంది. అలాంటి వారికి రేపటి నుంచే మీ ఇండ్లు ఉండవు పోండి! అంటే వారు ఎక్కడ తలదాచుకోవాలి? జీవితం అల్లకల్లోలం అవుతున్నట్టే కదా?తాజాగా సంగారెడ్డిలో హైడ్రా కూల్చివేతల గురించి మీడియాలో వీడియోలుచూస్తే భయాందోళనలు కలుగుతున్నాయి. కూల్చే యంత్రా నికి హృదయం లేదు. కానీ పైనుంచి ఆదేశాలిచ్చే వారికి, వాటిని అమలు చేసే వారికి హృదయం ఉంటుంది కదా? అది పనిచేయడం లేదు ఎందుకు? లేకపోతే అధికారానికి కండ్లు ఉండవు, సంపదకు ఆత్మ ఉండదనే నానుడిని నిజం చేస్తున్నారా? ఎవరెట్లా అనుకున్నా తాము అనుకున్న విధంగా ముందుకెళ్తామనే ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారా? కాంగ్రెస్ పాలనలో కూల్చడం తప్పా నిర్మించడం ఎక్కడైనా ఉన్నదా? కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమున్నదని భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. అంతా తమ ఇష్టం అనే భావనతో పాలకులు ఉంటే గనుక ముమ్మాటికీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నట్టే, పౌరుల జీవన భద్రతను గాలికి వదిలేసినట్టే.. భారత రాజ్యాంగ పీఠికకు తూట్లు పొడుస్తున్నట్టే. ఇప్పటికైనా కాంగ్రెస్ పాలక పెద్దలు తప్పును సరిచేసుకోకుంటే చరిత్ర అస్సలు క్షమించదు.

# ప్రపంచాన్ని బలి చేసిన ట్రంప్ యుద్ధోన్మాదం !



అమెరికా-ఇజ్రాయిల్ చేసిన యుద్ధంతో సాధించిందేమిటి? ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసిన ఈ ఇరు దేశాల నేతలు ఇప్పుడు చిద్విలాసంగానే ఉన్నారు. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని చూసి చేతులు కాల్చుకున్నారు. కానీ ప్రపంచ దేశాలు ఆయిల్, గ్యాస్ దొరక్క విలవిల్లాడాయి. ధరలు పెరిగాయి. విమానాలు రద్దయ్యాయి. ఎక్కడికి పోవాలన్నా విమాన ధరలు అందనంతగా పెరిగాయి. ఇంత విధ్వంసం చేసిన ట్రంప్ ..ఇప్పుడు తాత్కాలికంగా రెండు వారాలు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. నిజానికి శాశ్వతంగా యుద్ధాన్ని ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలి. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఇరాన్‌పై బాంబు దాడులు చేసి సాధించింది మాత్రం శూన్యం. ఓ రకంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో ట్రంప్ ప్రథమ దోషి. తరవాతి స్థానం నెతన్యాహూది. వీరి యుద్ధ కాంక్షకు, నిరంకుశ వైఖరికి ప్రపంచ దేశాలు అల్లాడాయి. బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైపోతోంది. చమురు ధరలు పెరిగాయి. చమురు అందకుండా పోయింది. నౌకలు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. దాని వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చమురుకు కొరత ఏర్పడినందువలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దాంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. దాని ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు. ఇలా ట్రంప్ సాధించిన ఘనతలకు ఇవన్నీ నిదర్శనాలుగా చెప్పుకోవాలి. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు తాత్కాలికం కారాదు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించేందుకు బేషరతుగా ట్రంప్ అడుగులు వేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న విషయమే అయినా, చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో ప్రభావం చూపడం చూస్తున్నాం. ఎందుకంటే చమురు చుట్టే అన్నీ పెనవేసుకుని ఉన్నాయి.

సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణ యత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల మీద అదుపు సంపాదిం చడమేనని ఇప్పుడు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వెనెజువెలా తరవాత ఇరాన్‌పై దాడి సులభంగా అవుతుందనుకున్న ట్రంప్‌కు ఇదొక పెద్ద షాక్. ఇకముందు ప్రపంచ దేశాలపై దాడులు చేస్తే ఆయా దేశాలు ఎదురుదాడికి సిద్ధంగా ఉంటాయని ట్రంప్ బుద్ధి తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో-ముడి చమురు మాత్రమే కాక దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని-20 శాతం మాత్రమే హోర్ముజ్ జల సంధి ద్వారా రవాణా అవుతుంది. రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఇంత చిన్న విషయానికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. అంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త వాణిజ్య వస్తువు కావడమే అని గుర్తించాలి. అది ఆర్థిక ఇబ్బందులను సృష్టించగలిగే అవకాశం ఎక్కువగా కలిగి ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంతే తీవ్రంగా ఉంటుంది. ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ మీద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదని ఈ నెల రోజుల్లో మనకు అనుభవంలోకి వచ్చింది.డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడిపోయి వుంది. అందుకే డాలర్ ఆధిపత్యం కొనసాగేందుకు అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించడానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు-డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల మీద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది. అందుకే దాడులుకు తెగిస్తోంది. ముడి చమురుపై పెత్తనం కోసం చేస్తున్న యుద్ధంగా దీనిని యూడాలి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ మీద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేసి,ఇరాన్‌ను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొట్టిందనే చెప్పాలి. అయితే ప్రపంచం మాత్రం మూల్యం చెల్లించుకుంది.

## సొంత ఆయిల్ ఉత్పత్తిపై భారత్ దృష్టి

న్యూఢిల్లీ,: భారత్ ప్రపంచంలో చమురు వినియోగ దేశాల్లో రెండోస్థానంలో ఉంది. మొదటిస్థానంలో చైనా ఉంది. భారత్ 90 శాతం చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్?రష్యా యుద్ధంతో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యా ఆయిల్ దిగుమతులు నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో మిత్రదేశమైన రష్యాకు భారత్ అండగా నిలిచింది. మరోవైపు రష్య కూడా బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఇంధనం సరఫరా చేస్తోంది. అయితే దీనిని అమెరికా జీర్ణించుకోవడం లేదు. ఈ కరణంగానే అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఇంకా విధిస్తామని బెదిరిస్తున్నాడు. మరోవైపు వెనుజువెలా ఆక్రమణ నేపథ్యంలో రష్యాలోని షెల్ ఆయిల్‌ను భారత్‌కు సరఫరా చేయాలని ప్లాన్ వేస్తున్నాడు. ఈ క్రమంలో భారత్ వైవిధ్యమైన మార్గాలు అన్వేషిస్తోంది. ఇంధన భద్రతను బలోపేతం చేస్తోంది. తాజాగా యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ పర్యటన సందర్భంగా మోదీతో కీలక చర్చలు జరిపారువెనెజువెలాలోని 'సాన్ క్రిస్టోబల్' ప్రాజెక్టుల్లో ఓఎన్జీసీకి పెద్ద వాటాలు ఉన్నాయి. 600 మిలియన్ డాలర్ల లాభాలు చమురు రూపంలో అందుతాయి. కానీ అక్కడి ముదురో ప్రభుత్వం కూలిపోవడంతో ఇప్పుడు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గయానాలో 11 బిలియన్ బ్యారెళ్ల నిల్వల్లో ఓఎన్జీసీ, రిలయన్స్ 2026 వేలంలో పాల్గొని ఉత్పత్తి హక్కులు సాధించబోతున్నాయిరష్యాలో ఓఎన్జీసీకి సాఖాలిన్?1లో 20%, వాంకోర్ క్షేత్రంలో 26% వాటాలు. 2009లో టామ్సక్ ప్రాంతంలో ఇంపీరియల్ ఎనర్జీని పూర్తిగా స్వాధీనం చేసుకుంది.

ఈ ప్రాజెక్టులు భారత ఇంధన అవసరాలకు స్థిరమైన మద్దతు.అబు దాబిలోబీపీసీఎల్, ఐవోసీ కలిసిఃఉర్జా భారత్' సంస్థ ఆన్‌షోర్ బ్లాక్1లోచమురు కనుగొన్నాయి. తాజాగా ఎక్స్ఎన్76 (షిలైఫ్) బావిలో తేలిక ముడి చమురు, ఎక్స్ఎన్?79 (హబ్షాన్)లో కొత్త నిక్షేపాలు లభించాయి. 6,162 చ.కి.మీ. విస్తీర్ణంలో 100% హక్కులతో పూర్తి ఉత్పత్తి అనుమతి. 2019 నుంచి సాగుతున్న అన్వేషణ దశ ముగిసి, భారీ పెట్టుబడులతో తవ్వకాలు మొదల య్యాయి. యూఏఈ ఇంధన ఉత్పత్తిలో కూడా ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద భాగస్వామిగా మారింది.సౌదీ సరఫరాలు, రష్యావెనెజు వెలాగయానా ప్రాజెక్టులు, అబుదాబిఉత్పత్తిఇవి భారతాన్ని దిగుమత ఆధారాల నుంచి స్వావలంబన వైపు నడిపిస్తున్నాయి. అమెరికా ఒత్తిడికి భారత్ స్వయం సమృద్ధి మార్గం ఎంపిక చేసుకుంది.

## జనారణ్యంలోకి జంతువులు



కర్నూలు, : రాయలసీమ వ్యాప్తంగా జనావాసాల్లోకి చిరుతల చొరబాట్లు పెరగడం కనిపిస్తోంది. పులులకు తీవ్రమైన నీటి కొరత, ఆవాసాలు తగ్గిపోవడం, పెరుగుతున్న పర్యావరణ ఒత్తిడే ఈ ధోరణికి కారణమని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోకపోతే.. ఈ ప్రాంతంలో మానవ-వన్యప్రాణుల సంఘర్షణ తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్న బకరపురం గ్రామంలో ఇటీవల జరిగిన ఓ ఘటన జరిగింది. గ్రామంలోకి ప్రవేశించిన చిరుత పిల్లను వీధి కుక్కలు చంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ అధికారుల సమాచారం ప్రకారం, రాయలసీమలో గత మూడేళ్లలో మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించిన 30కి పైగా చిరుతలు మరణించాయి. ఆందోళనకరంగా, గత సంవత్సరంలోనే 16 మరణాలు నమోదయ్యాయి.చిరుతపులులు మేకలు, గొర్రెలు, దూడలు, ఆవులు వంటి జంతువులను ఇష్టపడతాయి. ఆహారం కోసం అవి మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయి. కొన్నిసార్లు, అటవీ ప్రాంతాల్లో సమీపంలో నీటి వనరులు లేకపోవడం కూడా ఒక కారణంగా ఉంది. చిరుతపులులు దట్టమైన అడవుల్లో లోపల ఉండటానికి బదులుగా, కొద్దిగా బహిరంగ లేదా మైదాన ప్రాంతాల్లోకి వెళ్లడానికి ఇష్టపడతాయని అటవీ అధికారులు అంటున్నారు.చిరుతపులులు మనుషులపై దాడి చేయడానికి బయటకు రావడం లేదు. కానీ ఆకస్మాత్తుగా మనిషి ఎదురైతే దాని రక్షణలో భాగంగా దాడి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. వాటి సంచారం ప్రధానంగా ఆహారం, నీటి అన్వేషణ కోసమే ఉంటుంది. అడవుల అంచున ఉన్న గ్రామాల్లోకి చిరుతలు ఎక్కువగా వస్తుంటాయి.వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులు, అడవి పందులను నివారించడానికి రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలు పులులకు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కంచెల కారణంగా ప్రమాదవశాత్తు మరణాలు పెరుగుతున్నాయి. రైతులలో తక్షణమే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.అటవీ భూముల ఆక్రమణలతో పులుల సహజ ఆవాసాలను తగ్గిపోయేలా చేస్తూ, వన్యప్రాణులను మానవ నివాసాలకు మరింత దగ్గరగా నెడుతున్నాయి. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ఇప్పుడు జనావాస ప్రాంతాల వైపు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉందని, ఇది తమ జీవనోపాధికి ముప్పుగా మారిందని రైతులు వాపోతున్నారు.కొన్నిసార్లు పొలాల దగ్గర చిరుతపులులు సంచారం ఉన్నట్టుగా రైతులు చూస్తున్నారు. దానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పశువులను, మేకలను మేతకు బయటకు తీసుకెళ్లాలంటే భయపడుతున్నాయి.

## రాయలసీమలో ఫ్యాన్ కు ఉక్కపోత




కర్నూలు, : వైసీపీ అధికారంలో లేదు. అందరూ కలసి కట్టుగా పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే రాయలసీమ నేతలు మాత్రం ఒకరినొకరు తిట్టుకుంటూ పార్టీ పరువును నడి బజారున పడేస్తున్నారు. పార్టీ హైకమాండ్ కూడా పెద్దగా పట్టించు కోకపోవడంతో మరింత సీమ వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. రాయలసీమ వైసీపీలో నేతల మధ్య అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో గ్రూపు రాజకీయాలు, టికెట్ల పంచాయితీలు పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ మాత్రం సీమ నేతల చిందులను చూసీ చూడనట్లు వ్యవహరి స్తున్నారు.ఎమ్మిగనూరులో చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక వర్గాల మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఇరు వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నాయి. ఎమ్మిగనూరులో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుటుంబానికి, మాజీ ఎంపీ బుట్టా రేణుక వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణ నడుస్తోంది. కేడర్ రెండు వర్గాలుగా చీలిపోయింది. సింగనమలలో వర్గపోరు, కదిరిలో నేతల ఘర్షణలు తరచుగా రోడ్డెక్కుతున్నాయి. సింగనమల నియోజకవర్గంలో వైసీపీ నేతల అంతర్గత పోరుబహిరంగంగా బయటపడుతోంది. కదిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు చెప్పులతో కొట్టుకునే స్థాయికి విభేదాలు తీవ్రమయ్యాయి.ఇక అనంతపురం జిల్లాలోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వాళ్లను వెంటేసుకుని తిరుగుతున్నారంటూ తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఒకసారి పార్టీ మారిన వారిని పార్టీలోకి తీసుకుంటే చెప్పుతో కొడతానంటూ కేతిరెడ్డి మండిపడ్డారు. ఇలా నేతల మధ్య ర్గ విభేదాలు రాబోయే కాలంలో పార్టీ బలాన్ని తగ్గిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నేతల మధ్య సమన్వయం లేకపోవడం, ఆధిపత్య పోరు స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర రాజకీయ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

## వైసీపీతో బీసీవై కలిసి పోటీ..!

విజయవాడ,: రాజకీయాల్లో ఎవరు ఎప్పుడు ఏ స్థితిలో ఉంటారో చెప్పలేము. ఎందుకంటే ఒకసారి ఓటమి ఎదురవుతుంది. మరోసారి గెలుపు తలుపు తడుతుంది. అయితే రాజకీయ అవసరాలు కూడా అంతే. ఎవరితో ఏ అవసరం వస్తుందో చెప్పలేం కూడా. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అదే పరిస్థితి. ప్రత్యర్థి పార్టీలను ఓ రేంజ్ లో వేసుకోవడం వైసీపీకి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అయితే ఈ విషయంలో జనసేన కూడా బాధితురాలు. ఎందుకంటే జనసేన ను టార్గెట్ చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రచారం అంటూ లేదు. మొన్న జనసేన సంపూర్ణ విజయం, వైయస్సార్ కాంగ్రెస్ దారుణ ఓటమితో ఈ ప్రచారం కొట్టుకెళ్లిపోయింది. కానీ ఇప్పుడు అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భారత చైతన్య యువజన పార్టీ.. అలియాస్ బిసివై పార్టీపై ఆధారపడుతోందన్న టాక్ ప్రారంభం అయింది. ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడుతుండడం కొత్త రాజకీయ పరిణామం.చిత్తూరు జిల్లాకు చెందిన బోడె రామచంద్ర యాదవ్ భారత యువజన చైతన్య పార్టీని ఏర్పాటు చేశారు. బడుగులకు రాజ్యాధికారం అన్న నినాదంతో ఈ పార్టీని స్థాపించారు. పారిశ్రామికవేత్త అయిన బోడే రామచంద్ర యాదవ్ కు కేంద్రంలో మంచి పట్టు ఉంది. 2019 ఎన్నికల కు ముందు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి జనసేన తరఫున పుంగనూరు నుంచి పోటీ చేశారు. కానీ ఓటమి ఎదురయింది. కనీసం డిపాజిట్లు రాలేదు. అయితే తరువాత భారత చైతన్య యువజన పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బీసీవై పార్టీని టార్గెట్ చేశారు. పలుమార్లు బోడే రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి కూడా జరిగింది. కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేస్తూ చంద్రబాబు బీసీవై పార్టీ వెనుక ఉన్నార నేది అప్పట్లో ఒక విమర్శ.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అయితే బోడె రామచం ద్ర యాదవ్ పై ఓ రేంజ్‌లో విరుచుకుపడేవారు. ఆయన పేరును ప్రస్తావిం చేందుకు కూడా ఇష్టపడేవారు కాదు. పూజకు పనికిరాని పువ్వు అని సంబోధించేవారు. గతంలో బోడె రామచంద్ర యాదవ్ పై దాడి జరిగినప్పు డు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఖండించారు. ఒక సాధారణ నేతగా ఉన్న బోడె రామచంద్ర యాదవ్ విషయంలో ప్రతిపక్ష నేత స్పందించడం అప్పట్లో ఒక సంచలనమే. కనీసం బీసీవై పార్టీ ఒక పార్టీయేనా అని వ్యాఖ్యానించేవారు వైసీపీ సామాన్య కార్యకర్తలు.. కానీ ఇటీవల ఎందుకో బోడె రామచంద్ర యాదవ్ రూట్ మారింది. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వాన్ని విపరీతంగా వ్యతిరేకిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి విషయంలో సానుకూలంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి కట్టాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అందులో భాగంగానే బీసీవై పార్టీని కూటమి ప్రభుత్వంపై ఉసిగొల్పుతున్నారన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## అంతరిక్షం నుంచి సూర్యగ్రహణం ఎలా కనిపిస్తుందంటే..

## నాసా విడుదల చేసిన అద్భుత చిత్రాలు!



అంతరిక్షం నుంచి సూర్యగ్రహణం ఎలా ఉంటుందో కళ్లకు కట్టే అద్భుతమైన చిత్రాలను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా విడుదల చేసింది. చంద్రుడిపైకి మనుషులను పంపించే లక్ష్యంతో ఇటీవల నిర్వహించిన 'ఆర్టెమిస్-2' మిషన్ ఈ అపురూప దృశ్యాలను బంధించింది. భూమిపై చంద్రుడి నీడ (ఛాయ) ఒక పెద్ద నల్లటి మచ్చలా కదులుతున్నట్లు చూపిస్తున్న ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాలను చూస్తుంటే హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమాలోని గ్రాఫిక్స్‌ను చూస్తున్నట్లుందని నెటిజన్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రహణ సమయంలో భూమి అంచుల వెంబడి ప్రసరిస్తున్న కాంతి, మేఘాల మధ్య నుంచి కనిపిస్తున్న రంగులు మరో గ్రహాన్ని చూస్తున్న అనుభూతిని కలిగిస్తున్నాయని శాస్త్రవేత్తలు సైతం ఆశ్చర్యపోతున్నారు. మానవులను చంద్రుడిపైకి తీసుకెళ్లే బృహత్తర ప్రయోగంలో ఆర్టెమిస్-2 మిషన్ అత్యంత కీలకమైనది. ఇందులో భాగంగా వ్యోమగాములు చంద్రుడి చుట్టూ ప్రయాణించి భూమికి తిరిగి వస్తారు. ఈ మిషన్‌లో అమర్చిన అత్యాధునిక కెమెరాల ద్వారా ఈ చిత్రాలను తీశారు. ఇవి కేవలం

అద్భుత దృశ్యాలు మాత్రమే కాదని, గ్రహణ సమయంలో భూ వాతావరణంలో జరిగే మార్పులు, కాంతి ప్రసరణ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయని నాసా తెలిపింది. వేల కిలోమీటర్ల ఎత్తు నుంచి తీసిన ఈ ఫొటోలు సాంకేతిక విజయాన్ని చాటడమే కాకుండా, విశ్వంలోని అద్భుతాలను సరికొత్త కోణంలో వీక్షించే అవకాశాన్ని కల్పించాయని నాసా ప్రతినిధులు పేర్కొన్నారు.

### అమ్రాబాద్‌లో కొత్త అడ్వెంచర్

మహబూబ్ నగర్: వన్యప్రాణి, ప్రకృతి ప్రేమికులకు తెలంగాణ అటవీ శాఖ తీపి కబురు అందించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో త్వరలోనే 20 కిలోమీటర్ల సరికొత్త 'కొల్లాం' సఫారీ మార్గాన్ని ప్రారంభించనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు. ఇందుకోసం రహదారి పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ప్రస్తుతం అమ్రాబాద్‌లో మూడు రకాల సఫారీలు అందుబాటులో ఉన్నాయి.
ఫరాహాబాద్ సఫారీ మె?త్తం 16 కి.మీ. ప్రయాణం కాగా... 7 సీట్ల వాహనానికి రూ. 3 వేలు ఛార్జ్ చేస్తున్నారు. గుండం సఫారీ దట్టమైన అడవిలో 35 కి.మీ. ప్రయాణం కాగా..వాహనానికి రూ. 5 వేలు, అక్కమహాదేవి గుహల సఫారీ 14 కి.మీ ప్రకృతి అందాల మధ్య ప్రయాణానికి.. 5 సీట్ల వాహనానికి రూ. 3 వేలు వసూలు చేస్తున్నారు.ఈ సఫారీ కార్యకలాపాలన్నీ కూడా స్థానిక చెంచు గిరిజనులే నిర్వహిస్తున్నారు. మొత్తం 18 సఫారీ వాహనాలకు వారే డ్రైవర్లుగా, నేచర్ గైడ్‌లుగా వ్యవహరిస్తూ పర్యాటకులకు అడవి గురించి వివరిస్తారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని నేరుగా 'టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్'కు, గిరిజనుల జీవనోపాధికి మళ్లిస్తున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా టైగర్ రిజర్వ్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

# స్వరరాగాల సుర సుర..



ప్రసిద్ధ దేవాలయాల్లో నిక్షిప్తమై ఉండే నేలమాళిగలు, వాటిలో దాగుండే నిధి నిక్షేపాలు, వాటి వెనుక రహస్యాలు, దైవ నిర్ణయాలు.. తదితర అంశాల కలబోతగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్యమేనన్ కథానాయికలు. జులై 3న సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి రెండో పాటను ఈ నెల 19న విడుదల చేయనున్నారు. 'సుర సుర' అంటూ సాగే ఈ పాటను.. సంప్రదాయ పెళ్లి సంబరాల ఆనందోత్సాహాలను ప్రతిబింబించేలా భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందించారు.

జునైద్ కుమార్ అభే సంగీతం, గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్స్‌గా నిలువనున్నాయి. అనురాగ్ కులకర్ణి, కాలభైరవ, మంగ్లీ, సాహితి చాగంటి, కనకవ్వ, నల్గొండ గద్దర్ ఈ పాటను ఆలపించగా, కాసర్ల శ్యామ్ రాశారు. ఈ సినిమాకే ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

# దసరాకు రిలీజ్ చేసేలా.. ఫౌజీ షూటింగ్ స్పీడ్




ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకు లకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనుల ను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయంఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి..దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# చింతామణి సొంత కథ



శ్రీరామ్, మహిమా గుప్త జంటగా నటిస్తున్న చిత్రం 'చింతామణి సొంతకథ'. ప్రేమ్‌రాజ్ దర్శకుడు. బి.రాజీవ్‌కుమార్, రాకేష్ కర్రె, డా.ఎన్వీరావు, శ్రీనివాస్ పసుపులేటి నిర్మాతలు. హైదరాబాద్‌లో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి ప్రభుత్వ చీఫ్ విప్ అద్దంకి దయాకర్ క్లాప్ ఇవ్వగా, జీహెచ్‌ఎంసీ రిటైర్డ్ అసిస్టెంట్ కమీషనర్ వందనకుమార్ కెమెరా స్విచాన్ చేశారు. సోషల్ యాక్టివిస్ట్ డా.శ్రీనివాస్ తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా, నటుడు కాశీ విశ్వనాథ్, రచయిత నివాస్ కలిసి దర్శకుడికి స్క్రిప్ట్‌ని అందించారు. అతిథులంతా చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. కథలోని స్ట్రాంగ్ కంటెంట్ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు నిర్మాతలు చెప్పారు.

కమర్షియల్ పంథాలో సాగే క్రైమ్ థ్రిల్లర్ ఇదని, ఇందులో భార్యభర్తల డ్రామా ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

# విశ్వంభర'లో అవనిగా త్రిషా



చిరంజీవి నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వంలో మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్,వంశీ,ప్రమోద్ నిర్మిస్తున్నారు. పోస్ట్-ప్రొడక్షన్ పనులు చివరి దశలోఉన్న ఈ చిత్రం విడుదలకు దగ్గరవుతోంది. విడుదల చేసిన స్పెషల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో 'అవని' పాత్ర పోషించిన హీరోయిన్ త్రిషా కృష్ణన్ చిత్ర బృందం ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో సాంప్రదాయ దుస్తులలో వెలుగుతు న్న దీపాల పళ్ళెం పట్టుకుని త్రిష ఎంతో అద్భుతంగా కనిపిస్తోంది. గోల్డ్ కలర్ బ్యాక్‌డ్రాప్ పోస్టర్‌కు పండుగ వాతావరణాన్ని జోడించింది. దర్శకుడు వశిష్ట విజువల్ వండర్, మాస్ అప్పీల్ మేళవించి 'విశ్వంభర'ను అద్భుతంగా తీర్చిదిద్దు తున్నారు. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ముఖ్య పాత్రలలో నటిస్తుండగా, మౌని రారు ఒక స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఈ సినిమా త్వరలోనే థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి రచన-దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, సంగీతం: ఎంఎం కీరవాణి, భీమ్స్ సిసిరోలియో, డీఓపీ: చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్.

# రాకాలో ద్విపాత్రాభినయం మలుపు?

## అల్లు అర్జున్ రూపం వెనుక భారీ రహస్యం!





అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణే ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. "పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి" అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.

# జబ్బల రవిక డిజైనర్ కోకలో మలైకా కెవ్వు కేక



బాలీవుడ్ సీనియర్ బ్యూటీ మలైకా అరోరా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని సృష్టించుకుంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో తన స్టైలిష్ లుక్స్‌తో అభిమానుల గుండెల్లో మంటలు రేపుతోంది. ముఖ్యంగా ఆ జబ్బల రవిక (పఫ్ స్లీవ్ బ్లౌజ్), కాంబినేషన్ డిజైనర్ కోకలో మల్లా మెరిసిపోతున్న తీరు -కేక- పెట్టించేలా ఉంది. సాంప్రదాయ చీరకట్టుకు మోడ్రన్ టచ్ ఇస్తూ మలైకా చేస్తున్న ఈ ఫ్యాషన్ ప్రయోగాలు నెటిజన్లను మంత్రముగ్ధ లను చేస్తున్నాయి. ఇది గౌరి అండ్ నైనిక డిజైనర్ శారీ. ప్రస్తుతం 52 ఏళ్ల వయసులో ఉన్నా కానీ..మలైకా తన ఫిట్‌నెస్‌తో నేటి తరం హీరోయిన్లకు గట్టి పోటీనిస్తోంది. వయసు అనేది కేవలం ఒక నంబర్ మాత్రమేనని నిరూపిస్తోంది. బికినీలు, స్విమ్ వేర్లలో ఎంతటి గ్లామర్‌ను చిందిస్తుందో.. చీరకట్టు వంటి ట్రెడిషనల్ అవతారాల్లో అంతే హుందాతనాన్ని ప్రదర్శిస్తోంది. మలైకా ఫ్యాషన్ సెన్స్ నుండి నేటితరం నేర్చుకోవాల్సింది ఏమిటంటే.. బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా దుస్తులను ఎంపిక చేసుకోవడం.. ఏ రకమైన దుస్తులనైనా పూర్తి ఆత్మవిశ్వాసంతో ధరించడం. మలైకా వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కెరీర్ పరంగా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. ఆర్బాజ్ ఖాన్‌తో వివాహ బంధం ముగిసినా.. ఆ తర్వాత అర్జున్ కపూర్‌తో ప్రేమాయణం బ్రేకప్ అయినా.. కుంగిపోకుండా తన కెరీర్‌పై దృష్టి సారించింది. వ్యక్తిగత బాధలను తన వృత్తిగత ఎదుగుదలకు అడ్డంకిగా మార్చుకోకుండా.. మరింత స్ట్రాంగ్‌గా నిలబడటం మలైకాలోని గొప్ప లక్షణం. ప్రస్తుతం ఈ బ్యూటీ తన ఫోకస్ అంతా కెరీర్, ఫిట్‌నెస్‌పైనే ఉంచుతూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. వెండితెరపై ఐటమ్ సాంగ్స్‌తో ఒకప్పుడు ఊపు ఊపిన మలైకా ప్రస్తుతం రియాలిటీ షోలకు జడ్జిగా రాణిస్తోంది. ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్, ఝలక్ దిఖ్లా జా, సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్ వంటి పాపులర్ షోలలో జడ్జిగా వ్యవహరిస్తూ తన విలక్షణమైన శైలిని ప్రదర్శిస్తోంది. అలాగే తన సొంత షో -మూవింగ్ ఇన్ విత్ మలైకా- ద్వారా తన వ్యక్తిగత జీవితాన్ని ప్రేక్షకులతో పంచుకుంది. సినిమా ఆఫర్లు ఈ బ్యూటీని ఎందుకు వరించడం లేదనే చర్చ వస్తే.. మలైకాకేవలం స్పెషల్ సాంగ్స్ లేదా గెస్ట్ రోల్స్ కే పరిమితం కావడం.. పూర్తి స్థాయి నటిగా కంటే ఫ్యాషన్ ఐకాన్‌గా ఉండటానికే మొగ్గు చూపడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఇక మలైకా అరోరా కొత్త రిలేషన్ గురించి సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. అర్జున్ కపూర్‌తో విడిపోయిన తర్వాత ఈ భామ -స్విట్స్‌విల్లా శ6- ఫేమ్ సోరబ్ భేడీతో ప్రేమలో ఉన్నట్లు పుకార్లు షికారు చేశాయి. అయితే ఈ వార్తలపై సోరబ్ స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. తామిద్దరం కేవలం స్నేహితులమని ఒకరినొకరు బాగా నమ్ముతామని పేర్కొంటూ ఈ రూమర్లకు చెక్ పెట్టారు. మలైకా కూడా ప్రస్తుతం తన ఒంటరి జీవితాన్ని ఎంజాయ్ చేస్తూ కెరీర్‌పైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com